


# తొలివార్త
తెలుగు దిన పత్రిక
RNI : TGTEL/25/A0357
ప్రజా గళం మా కలం.....
www.tolivaartha.com
www.epaper.tolivaartha.com



రిపోర్టర్లు కావలెను...

తొలివార్త తెలుగు దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లా రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్చార్జిలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను. అనుభవం కలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించవలసిన నెంబరు : 90108 80040



ప్రచురణ : రంగారెడ్డి ఎడిటర్ : లింగాల నరేందర్ గౌడ్ సంపుటి : 01 సంచిక : 244 వెల : 4 పేజీలు : 08 శుక్రవారం 06 - 02 - 2026


# ప్రాణాలకు తెగించి తెలంగాణ ప్రకటించారు

- సోనియా గాంధీ త్యాగంతోనే తెలంగాణ
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ప్రాణాలకు తెగించి రాష్ట్రాన్ని ప్రకటించారు
- మున్సిపల్ ఎన్నికల అభ్యర్థులతో జరిగిన సమావేశంలో ఆయన కీలక వ్యాఖ్యలు
- రాజకీయాల్లో గెలుపునకు డబ్బు కొలమానం కాదని, ప్రజల నమ్మకమే నిజమైన పెట్టుబడి
- రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకువెళ్లాలని సూచన
- తెలంగాణ ఏర్పాటు ప్రక్రియలో సోనియా గాంధీ చూపిన తెగువను సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు
- పార్లమెంటులో పెప్పర్ స్ప్రే దాడులను సైతం లెక్కచేయకుండా పొన్నం ప్రభాకర్ వంటి నేతలు పోరాట చేసిన పోరాటం చేశారు
- టికెట్ దక్కని నాయకులను కలుపుకొని పోవాల్సిన బాధ్యత అభ్యర్థులదేనని స్పష్టం



**తొలివార్త, హైదరాబాద్, ఫిబ్రవరి 05 :** సోనియా గాంధీ ఇచ్చిన మాట నిలబెట్టు కున్నారని, ఎన్ని కష్టాలు ఎదురైనా వెనకడుగు వేయకుండా ప్రాణాలకు తెగించి తెలంగాణ ఇచ్చారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.గురువారం కరీంనగర్ జిల్లా గుమ్లాపూర్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, 2004లో ఇదే జిల్లాలో సోనియా గాంధీ తెలంగాణ ప్రకటన చేశారని, ఆ మాటను నిలబెట్టుకునే క్రమంలో పార్టీని సైతం పణంగా పెట్టారని గుర్తుచేశారు. మరోవైపు, జిల్లా పర్యటనలో భాగంగా మున్సిపల్ ఎన్నికల అభ్యర్థుల తో జరిగిన సమావేశంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లో గెలుపునకు డబ్బు కొలమానం కాదని, ప్రజల నమ్మకమే నిజమైన పెట్టుబడి అని దిశానిర్దేశం - మిగతా 2 లో

# మరో రెండేళ్లలో కేసీఆర్ సీఎం అవుతారు



- బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు
- అప్పుడు మిగిలిన పనులు చేసుకుందాం
- గజ్వేల్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న హరీశ్ రావు
- మనల్ని బాగా చూసుకునే వారికి ఓటు వేయాలని పిలుపు
- ధైర్యం ఉంటే అభివృద్ధిలో కేసీఆర్‌తో పోటీ పడాలని ముఖ్యమంత్రికి సవాల్

**తొలివార్త, హైదరాబాద్, ఫిబ్రవరి 05 :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరో రెండేళ్లలో మరోసారి ముఖ్యమంత్రి అవుతారని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక మిగిలిన అభివృద్ధి పనులు పూర్తి చేసుకుందామని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ వాళ్లు ఏమీ చేయరని విమర్శించారు. గజ్వేల్ మున్సిపల్ ఎన్ని కల ప్రచారంలో పాల్గొన్న హరీశ్ రావు మాట్లాడుతూ, మనల్ని బాగా - మిగతా 2 లో


2 లో

# తెలంగాణను రక్షించుకోవాలంటే బీజేపీకి ఓటు వేయాలి

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- ఏపీలో ఎన్నో విమానాశ్రయాలు ఉన్నా తెలంగాణలో ఎందుకు లేవని ప్రశ్న
- కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ బంగారు బాతు అయిందని విమర్శ
- దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా తెలంగాణ నుంచే వెళుతున్నాయని ఆగ్రహం

# అమెరికా గుండెల్లో 'ఇరాన్' రైళ్లు

- భూగర్భంలో భారీ క్షిపణి కేంద్రం సిద్ధం
- రక్షణ నుంచి దాడుల శైలికి ఇరాన్ సైనిక సిద్ధాంతం మార్పు
- అండర్ గ్రౌండ్ మిస్సైల్ బేస్‌ను సందర్శించిన ఇరాన్ సైనిక దళాల అధిపతి
- శత్రువులపై విరుచుకుపడేలా క్షిపణి సామర్థ్యం పెంపు
- అమెరికా తప్పు చేస్తే వారి స్థావరాలకు రక్షణ ఉండదని హెచ్చరిక


2 లో


2 లో

# బొగ్గు గనిలో పేలుడు...

- 10 మంది మృత్యువాత
- మేఘాలయలోని బొగ్గు గనిలో భారీ పేలుడు
- ఘటనలో 10 మంది కార్మికులు అక్కడికక్కడే మృతి
- మృతుల్లో ఎక్కువ మంది అసోం వాసులుగా అనుమానం
- ఘటనా స్థలంలో కొనసాగుతున్న సహాయక చర్యలు

# వికసిత భారత్ లక్ష్యంగా దేశం ముందుకు సాగుతోంది

- భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- నిరసనల మధ్య... రాజ్యసభలో ప్రధాని మోదీ ప్రసంగం... విపక్షాల వాకౌట్
- రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో ప్రధాని ప్రసంగం
- మాజీ ఆర్మీ చీఫ్ నరవణే పుస్తకంపై చర్చకు పట్టుబట్టిన విపక్షాలు
- ప్రధాని మాట్లాడుతుండగా నినాదాలు.. సభ నుంచి వాకౌట్ చేసిన విపక్ష సభ్యులు
- వికసిత భారత్ లక్ష్యంగా దేశం ముందుకు సాగుతోందన్న ప్రధాని మోదీ
- భారత్‌తో వ్యాపారానికి ప్రపంచ దేశాలు ఆసక్తి చూపుతున్నాయని వ్యాఖ్య



**తొలివార్త, ఢిల్లీ, ఫిబ్రవరి 05 :** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో అధికార, విపక్షాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. గురువారం రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమాధానం ఇస్తుండగా, విపక్ష సభ్యులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సభా కార్యకలాపాలకు అడ్డంకి కలిగించి, చివరకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో సభ నుంచి వాకౌట్ చేశారు.మాజీ సైన్యాధిపతి జనరల్ ఎం.ఎం. నరవణే తన ఆత్మకథలో రాసిన కొన్ని కీలక అంశాలపై లోక్‌సభలో చర్చకు అనుమతించకపోవడమే ఈ గందరగోళానికి ప్రధాన కారణం. 2020లో చైనాతో సరిహద్దు ఘర్షణల సమయంలో - మిగతా 2 లో

# సీబీఐ ఎక్కడా క్లీన్ చిట్ ఇవ్వలేదు

- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- తిరుమల లడ్డు వ్యవహారంలో సీబీఐ ఎక్కడా క్లీన్ చిట్ ఇవ్వలేదు
- గత వైసీపీ ప్రభుత్వంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తీవ్ర ఆరోపణలు
- తిరుమల లడ్డు ప్రసాదంలో నెయ్యికి బదులు పామాయిల్, రసాయనాలు వాడారని వ్యాఖ్య
- అయోధ్య రామమందిర ప్రారంభోత్సవానికి కూడా లక్ష కల్తీ లడ్డూలు పంపారని ఆరోపణ
- ఈ వ్యవహారంలో ఎక్కడా సీబీఐ క్లీన్ చిట్ ఇవ్వలేదని, వాస్తవాలు బయటపెడతామని స్పష్టీకరణ



**తొలివార్త, అమరావతి, ఫిబ్రవరి 05 :** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు ఎంతో పవి త్రంగా భావించే తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో గత ప్రభుత్వ హయాంలో భారీ కుంభకోణం జరిగిందని - మిగతా 2 లో

# మీరు చేసింది మహా పాపం

- ఏక సభ్య కమిషన్ వేస్తున్నాం
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- తిరుమల నెయ్యి కల్తీపై సీఎం చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజం
- గత వైసీపీ ప్రభుత్వం 2022 నివేదికను ఉద్దేశపూర్వకంగా తొక్కిపెట్టిందని ఆరోపణ
- సీఎంగా బాధ్యతలు చేపట్టగానే ప్రక్షాళన మొదలుపెట్టానని వెల్లడి
- పామాయిల్, కెమికల్స్, జంతువుల కొవ్వుతో నెయ్యి తయారు చేశారని ఆగ్రహం
- దేవుడితో పెట్టుకోవద్దని, భక్తుల మనోభావాలను దెబ్బతీయొద్దని తీవ్ర హెచ్చరిక



**తొలివార్త, అమరావతి, ఫిబ్రవరి 05 :** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో నెయ్యి కల్తీ వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత వైసీపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఈ వ్యవహారాన్ని తొక్కిపెట్టి, భక్తుల మనోభావాలను దెబ్బతీసిందని, ఇది క్షమించరాని మహా పాపం అని ఆయన అభివర్ణించారు. దేవుడితో చెలగాటమాడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో హిందూ దేవాలయాలపై జరిగిన దాడులను, అపవిత్ర ఘటనలను గుర్తుచేస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. - మిగతా 2 లో

# తిరుమల లడ్డూపై దుష్ప్రచారం చేస్తున్నారు

- ఢిల్లీలో వైసీపీ ఎంపీల మీడియా సమావేశం
- లడ్డు నెయ్యిలో కొవ్వు ఆరోపణలు పూర్తిగా అవాస్తవమన్న వైసీపీ ఎంపీలు
- సీబీఐ, సిట్ నివేదికల్లో క్లీన్ చిట్ వచ్చిందని వెల్లడి
- సత్యశోధన పరీక్షకు సిద్ధమన్న టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి
- రాజకీయ లబ్ధి కోసమే కూటమి విష్రప్రచారం చేస్తోందని ఆరోపణ
- ప్రభుత్వ వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించేందుకే ఈ కుట్రలన్న వైసీపీ



**తొలివార్త, అమరావతి, ఫిబ్రవరి 05 :** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి నేతలు చేస్తున్న ఆరోపణలను వైసీపీ ఎంపీలు తీవ్రంగా ఖండించారు. లడ్డూ తయారీలో వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిపారన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, సీబీఐ - మిగతా 2 లో

# సంపాదకీయం

## ఆత్మనిర్భరత బాటలో...

ఆర్థిక మంత్రి నిర్మలా సీతా రామన్ ప్రకటించిన కొత్త బడ్జెట్ ఎలాంటి మెరుపులు, ఆశ్చర్యపరిచే ప్రకటనలు లేకుండా సాగిపోయింది. తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్, అస్సాం అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని జనాకర్షణ ప్రకటనలుండవచ్చునన్న ఊహాగానాలకు ప్రారంభంలోనే నిర్మలమ్మ తెరదించారు. "జనాకర్షణ కాదు... జన సంక్షేమమే ప్రధానం" అని తేల్చి చెప్పారు. నరేంద్ర మోదీ సారథ్యంలో



ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బడ్జెట్ దిశ మారింది. భారీ తాయిలాలతో ప్రజలను బుజ్జగించే ధోరణులకు చరమగీతం పాడింది. దీర్ఘకాలిక వృద్ధికి పెద్దపీట వేయడం, 2047 నాటికి 'వికసిత్ భారత్'గా దేశాన్ని తీర్చి దిద్దడానికే పెద్దపీట వేసింది. ఈ ప్రయాణంలో మరో ముందడుగు 202627 సంవత్సరానికి నిర్మల ప్రకటించిన ఈ బడ్జెట్ అని చెప్పవచ్చు. గత ఏడాది ద్వితీయార్థంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన భారీ సుంకాల ప్రభావంతో చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగం భారీగా దెబ్బతింది. ఉపాధి రంగంలో సింహభాగం ఈ రంగాలదే. అందుకే ఈ రంగాలను ఆదుకునేందుకు రూ.10,000 కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేయడం అభిలషణీయమైన చర్య. దీనివల్ల ఎంఎస్ఎంఈ రంగంలో నిధుల కొరత తీరుతుంది. అలాగే గత కొన్నేళ్లుగా పలు కీలక రంగాలు సెమీ కండక్టర్ చిప్‌ల కొరతతో అల్లాడిపోతున్నాయి. దేశీయంగా వాటి ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే ఈ బడ్జెట్‌లో ఇండియా సెమీ కండక్టర్ మిషన్ 2.0 ప్రకటించి కేటాయింపులను రూ.40,000 కోట్లకు పెంచారు. ప్రస్తుతం అమలు జరుగుతున్న సెమీ కండక్టర్ మిషన్ 1.0 కేటాయింపులతో పోల్చితే సుమారుగా రెట్టింపు చేశారు. దీనితో పాటుగా రేర్ ఎర్త్ మ్యాగ్నెట్లు, టెక్స్‌టైల్స్, బయోఫార్మా, ఎలక్ట్రానిక్స్ ఉపకరణాలు, యంత్రపరికరాలు, రసాయనాల రంగాలను వ్యూహాత్మక ప్రాధాన్యతా రంగాలుగా ప్రకటించడం వల్ల వాటికి ప్రభుత్వం నుంచి మరింత అధికంగా మద్దతు లభిస్తుంది. బయోఫార్మా రంగం కోసం రూ.10,000 కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేయడం ఆ రంగానికి ఎంతో ఉత్తేజం కల్పిస్తుంది. దేశంలో మధుమేహం, క్యాన్సర్ వంటి జీవనశైలి వ్యాధులు ప్రబలిపోతున్న దశలో ఇది మంచి అడుగు. ఆ వ్యాధులను ఎదుర్కొనేందుకు అవసరమైన ఔషధాల తయారీకి ఇది మద్దతు ఇస్తుంది. అంతే కాదు...పలు కీలక రంగాలకు అరుదైన ఖనిజాల లభ్యతను పెంచేందుకు దేశంలో ఏర్పాటు చేయనున్న నాలుగు రేర్ ఎర్త్ కారిడార్లలో ఆంధ్రప్రదేశ్‌కు కూడా స్థానం లభించడం హర్షదాయకం.అలాగే దేశంలో ఇటీవల కాలంలో డేటా సెంటర్ల విస్తరణ జోరుగా సాగుతోంది. గతంలో ఐటీ తరహాలో ఉపాధికల్పనకు ఇప్పుడు డేటా సెంటర్లు కీలకంగా మారాయని నిపుణులంటున్నారు. ఈ నేపథ్యంలో దేశంలో డేటా సెంటర్లు ఏర్పాటు చేసే కంపెనీలకు 2047 వరకు పన్ను విరామం ఇవ్వడం ఆ రంగాన్ని ఎంతో ఉత్తేజితం చేస్తుంది. ఇందులో ఇప్పటికే హైదరాబాద్ కీలక కేంద్రంగా ఉన్నది. ఆంధ్రప్రదేశ్ కూడా ఇప్పుడు ఆ పోటీలో ప్రవేశించింది. ఆ రకంగా ఈ చర్య రెండు రాష్ట్రాలకు ఎంతో సహాయకారి అవుతుంది. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మౌలిక వసతుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తూ కేటాయింపులు సైతం పెంచుకుంటూ వస్తోంది. ఈ బడ్జెట్‌లో ప్రభుత్వ మూలధన వ్యయాలను రూ.12.22 లక్షల కోట్లకు, అంటే గత బడ్జెట్‌తో పోల్చితే 12.5శాతం పైబడి పెంచడం కూడా ఆర్థిక రంగాన్ని ఉత్తేజితం చేస్తుంది. కీలక రంగాలకు అవసరమైన నిధులు అందుబాటులోకి వచ్చి ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఇందులో భాగంగానే కొత్త బడ్జెట్‌లో ఏడు హైస్పీడ్ కారిడార్లను ప్రతిపాదించగా వాటిలో మూడు హైదరాబాద్‌తో అనుసంధానమైనవి కావడం కూడా తెలుగు రాష్ట్రాలకు ఆనందం కలిగించే అంశం. దేశాన్ని విదేశీ మూకల నుంచి కాపాడాలంటే రక్షణ రంగాన్ని పటిష్ఠం చేయడం ఎంతో అవసరం. ఇటీవల కాలంలో పొరుగుదేశాలైన పాకిస్థాన్, బంగ్లాదేశ్, చైనా నుంచి ముప్పు పెరుగుతూ వస్తున్న నేపథ్యంలో రక్షణ బడ్జెట్‌ను ఏకంగా జీడీపీలో 2 శాతానికి పెంచడం సాయుధ దళాల పోరాట సంసిద్ధతను, సామర్థ్యాన్ని మరింతగా పెంచడానికి దోహదపడే చర్య. మొత్తం మీద ఈ బడ్జెట్ అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడుకుంటూ విభిన్న కోణాల నుంచి ప్రజలకు రక్షణ కల్పిస్తూ దేశాన్ని ఆత్మనిర్భరత బాటలో నడుపుతుందని ఆశించవచ్చు.

# మీరు చేసింది మహా పాపం...

**మొదటిపేజీ తరువాయి** – ఇవాళ ఉండవల్లిలో కూటమి నేతల కీలక సమావేశం అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు.

**భక్తుల మనోభావాలతో ఆడుకోవద్దు**

కరడుగట్టిన నేరస్థులు అసత్యాన్ని ఎలా నమ్మిస్తారో, అలాగే గత పాలకులు ఇప్పుడు మాట్లాడుతున్నారని చంద్రబాబు అన్నారు. "సీబీఐ నివేదికలో కల్తీ లేదని ఎక్కడా చెప్పలేదు. అయినా, కల్తీ జరగలేదని ఎదురుదాడి చేస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. రాష్ట్రంలోని భక్తులందరికీ ఒక సామాన్య భక్తుడిగా విజ్ఞప్తి చేస్తున్నా. దేవునికి అపచారం జరిగినప్పుడు ముక్తకంఠంతో ఖండించాలి. ఈ దోషులను కఠినంగా శిక్షిస్తాం. ఏకసభ్య కమిషన్ వేసి సమగ్ర విచారణ జరిపిస్తాం. ఇప్పటివరకు ఉన్న నివేదికలన్నీ ఆ కమిషన్ ముందు ఉంచుతాం. అవసరమైతే కోర్టులోనూ అదనపు సమాచారం సమర్పిస్తాం. ఇది దేవుడిచ్చిన బాధ్యత, దైవ కార్యం. ఇలాంటివి పునరావృతం కాకుండా చూస్తాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

**దేవుడితో పెట్టుకోవద్దు.. ఇది దుర్మార్గమైన అపచారం**

వైసీపీ నేతలకు దేవుడిపై విశ్వాసం లేకపోవచ్చుని, కానీ విశ్వాసం ఉన్న కోట్ల మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసే హక్కు వారికి లేదని చంద్రబాబు హెచ్చరించారు. "అంతర్వేదిలో రథం తగలబడితే కందిరీగలు కొరికాయని, ఆంజనేయుడి విగ్రహాన్ని పగలగొడితే 'అదో బొమ్మే కదా, ఇంకోటి పెట్టుకోండి' అని అప్పటి పాలకులు ఎంతో గర్వంగా మాట్లాడారు. ఇవన్నీ చేస్తూ, తిరిగి మాపైనే నిందలు వేశారు. విశ్వాసం లేకపోతే దేవుడి జోలికి రావొద్దు. దేవుడి పవిత్రతను దెబ్బతీయడం దుర్మార్గం. చరిత్రలో ఇప్పటివరకు శ్రీ వెంకటేశ్వర స్వామి జోలికి ఎవరూ రాలేదు. బ్రిటిష్ వాళ్లు కూడా



స్వామివారి సంప్రదాయాలను గౌరవించి, మరింత అభివృద్ధి చేశారు. అలాంటిది మీరు చేసిన ఈ పని దుర్మార్గమైన అపచారం" అని ఆయన తీవ్రంగా ఖండించారు.

**సీఎంగా బాధ్యతలు చేపట్టగానే ప్రక్షాళన**

తాను ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలి ప్రాధాన్యతగా పరిపాలన, దైవ కార్యాల ప్రక్షాళనపై దృష్టి సారించానని చంద్రబాబు వివరించారు. "ముఖ్యమంత్రిగా నా కార్యకలాపాలు ప్రారంభించేందుకు ఒక ప్రిన్సిపల్ సెక్రటరీని నియమించడం నా మొదటి సంతకం. మానవ సేవ కన్నా ముందు మాధవ సేవ ముఖ్యమని భావించి, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తిరుమల ప్రక్షాళన కోసం టీటీడీ ఈఓగా శామలరావును నియమిస్తూ రెండో సంతకం చేశాను. ఈ రెండు పనులు పూర్తి చేశాకే ఇతర కార్యక్రమాలు చేపట్టాను" అని ఆయన తెలిపారు. అనంతరం తిరుమలలో పరిస్థితులను సమీక్షించి, కల్తీ జరుగుతోందన్న అనుమానంతో నెయ్యి శాంపిళ్లను నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్‌డీడీబీ)కు పంపించామని, ఆ నివేదికలోనే కల్తీ వాస్తవాలు బయటపడ్డాయని స్పష్టం చేశారు.

**2022లోనే నివేదిక.. అయినా తొక్కిపెట్టారు**

ఈ కల్తీ వ్యవహారం కొత్తగా బయటపడింది కాదని, 2022లోనే గత వైసీపీ ప్రభుత్వానికి దీనిపై నివేదిక అందిందని చంద్రబాబు సంచలన విషయాలు వెల్లడించారు."2022లో సీఎఫ్టీఆర్ఐ ఇచ్చిన నివేదికలో నెయ్యి కల్తీ జరుగుతోందని చాలా స్పష్టంగా ఉంది. కానీ, ఆ నివేదికను వాళ్లు ఉద్దేశపూర్వకంగా తొక్కిపెట్టారు. యథేచ్ఛగా కల్తీ నెయ్యి సరఫరాను కొనసాగించారు" అని ఆయన ఆరోపించారు. ఇప్పుడు ఏర్పాటైన సిట్ విచారణలో మరింత భయంకరమైన నిజాలు బయటపడ్డాయని, నెయ్యి తయారీలో పామాయిల్, ప్రమాదకర రసాయనాలు, చివరికి జంతువుల కొవ్వు (యానిమల్ ఫ్యాట్) కూడా వాడుతున్నట్లు తేలిందని ముఖ్యమంత్రి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

**గత ఐదేళ్లలో హిందూమతంపై దాడి**

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో హిందూ దేవాలయాలు, సంప్రదాయాలపై దాడులు పరాకాష్టకు చేరాయని చంద్రబాబు విమర్శించారు. "ఒకప్పుడు ఇదే అసెంబ్లీలో తిరుమల రెండు కొండలే, ఏడు కొండలు కాదని మాట్లాడినప్పుడు మేం వ్యతిరేకించాం. విజయనగరంలో రాముడి విగ్రహం తల నరికివేస్తే, అక్కడికి వెళ్లి వాస్తవాలు తెలుసుకోవాలనుకున్న నాపైనే కేసు పెట్టారు. అంతర్వేదిలో రథం తగలబడితే ఎలుకలు కొరికాయని చెప్పారు. ఆంజనేయుడి విగ్రహాన్ని పగలగొడితే 'అదో బొమ్మే కదా, ఇంకోటి పెట్టుకోండి' అని అప్పటి పాలకులు ఎంతో గర్వంగా మాట్లాడారు. ఇవన్నీ చేస్తూ, తిరిగి మాపైనే నిందలు వేశారు" అని ఆయన మండిపడ్డారు.

# సీబీఐ ఎక్కడా క్లీన్ చిట్ ఇవ్వలేదు

**మొదటిపేజీ తరువాయి** – ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారం సుప్రీంకోర్టు వరకు వెళ్లినా, ఇందులో సీబీఐ ఎక్కడా క్లీన్ చిట్ ఇవ్వలేదని ఆయన గుర్తుచేశారు. ఈ వ్యవహారంలో దోషులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని, భగవంతుడి ముందు వారు మోకరిల్లే వరకు తమ యుద్ధం ఆగదని హెచ్చరించారు.నెయ్యి పేరుతో పామాయిల్, ప్రమాదకరమైన రసాయనాలు వాడి భక్తుల మనోభావాలను, ఆరోగ్యాన్ని దెబ్బతీశారని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈ వ్యవహారంపై మాట్లాడేటప్పుడు తాము అన్ని పరిణామాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని, ఈ అంశాన్ని ప్రజల దృష్టికి తీసుకురావడం తన బాధ్యత అని స్పష్టం చేశారు. ఇవాళ ఉండవల్లిలో కూటమి నేతల సమావేశం అనంతరం నిర్వహించిన ప్రెస్ మీట్ లో పవన్ మాట్లాడారు.పవన్ కల్యాణ్ తన ఆరోపణలకు సంబంధించిన గణాంకాలను కూడా మీడియా ముందుంచారు. "తిరుమల తిరుపతి దేవస్థానానికి (టీటీడీ) ఓ నిర్దిష్ట కంపెనీ 59.70 లక్షల కిలోల నెయ్యి సరఫరా చేసినట్లు అధికారికంగా లెక్కలు చూపింది. కానీ, మా వద్ద ఉన్న ఆధారాల ప్రకారం, అదే కంపెనీ 58 లక్షల కిలోలకు పైగా పామాయిల్, దానికి సంబంధించిన ప్లాంట్ బేస్డ్ ఉత్పత్తులను కొనుగోలు చేసింది. అంతేకాకుండా, సుమారు 1.70 లక్షల నుంచి 2 లక్షల కిలోల వరకు రసాయనాలను కూడా కొనుగోలు చేసినట్లు ఆన్ రికార్డ్ ఆధారాలున్నాయి. నెయ్యి సరఫరా చేస్తున్నామని చెప్పి, పామాయిల్, రసాయనాలు కొనుగోలు చేయడం వెనుక ఉన్న మతలబు ఏంటి? ఇది కల్తీ నెయ్యి కాదు, కల్తీ వనస్పతి, కల్తీ పామాయిల్" అని పవన్ వివరించారు. ఈ కుంభకోణం కేవలం తిరుమలతోనే ఆగిపోలేదని, అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ఠ మహోత్సవానికి కూడా ఇక్కడి నుంచి పంపిన లక్ష లడ్డూలు సైతం ఈ కల్తీ నెయ్యితో తయారు చేసినవేనని పవన్ ఆరోపించారు. దేశమంతా ఎంతో పవిత్రంగా జరుపుకున్న కార్యక్రమానికి సైతం కల్తీ లడ్డూలు పంపి హిందువుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచారని ఆయన మండిపడ్డారు.గత ప్రభుత్వానికి దేవుడిపై, హిందూ సంప్రదాయాలపై పగ ఉందని, అందుకే ఇలాంటి చర్యలకు పాల్పడ్డారని పవన్ తీవ్రస్థాయిలో విమర్శించారు. "వీరికి ఏడుకొండల స్వామిపై ఎందుకో పగ. ఏడు కొండలు ఎందుకు, రెండు చాలు అన్న చరిత్ర వీరిది. వీరు వ్యక్తులపై, ప్రత్యర్థులపై కాదు, ఏకంగా భగవంతుడిపైనే పగబట్టారు. ఈ కుట్ర వెనుక ఉన్న వారి వారసత్వం, వారి పరంపర ఎలాంటిదో ప్రజలు గమనించాలి. అందుకే ఈ అంశాన్ని సరిదిద్ది, వాస్తవాలను బయటపెట్టాల్సిన అవసరం ఉంది" అని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ అక్రమాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆయన పరోక్షంగా హెచ్చరించారు. "గత ఐదేళ్లలో, అంటే 2019 నుంచి 2024 వరకు, రాష్ట్రంలో వైసీపీ పాలనలో హిందూ ధర్మానికి, దేవాలయాలకు తీరని అపచారాలు జరిగాయి. ఇవి చాలా సున్నితమైన అంశాలు. మత విశ్వాసాలతో ముడిపడి ఉన్న విషయాలపై ఆనాటి ప్రభుత్వ పెద్దలు చూపిన నిర్లక్ష్యం, వారి బాధ్యతారాహిత్యం ప్రజల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయి. ఉదాహరణకు, రామతీర్థంలో సాక్షాత్తూ శ్రీరామచంద్రమూర్తి విగ్రహ శిరచ్ఛేదనం జరిగితే, దాన్ని ఎవరో ఆకతాయి చేసిన పనిగా తేల్చేశారు. పిఠాపురంలో దేవతా విగ్రహాలకు అశుద్ధం పూస్తే, దానిని ఎవరో పిచ్చోడి చర్యగా చిత్రీకరించి చేతులు దులుపుకున్నారు. విజయవాడ కనకదుర్గమ్మ వారి ఆలయంలో వెండి సింహాలు మాయమైతే, 'అవి పోతే ఇంకొకటి కొంటాం, వాటితో ఏమైనా మేడలు, మిద్దెలు కడతామా?' అని అప్పటి మంత్రులు ఎంత



నిర్లక్ష్యంగా మాట్లాడారో ప్రజలు మర్చిపోలేదు. ఇక అంతర్వేదిలో పవిత్రమైన రథం కాలిపోతే, దాన్ని మతిస్థిమితం లేని వ్యక్తి చేసిన పనిగా తేల్చేసి కేసును పక్కన పెట్టేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు ఎన్నో జరిగినా, ఆనాటి ప్రభుత్వంలో ఒక్కరు కూడా బాధ్యతగా మాట్లాడటం గానీ, కఠిన చర్యలు తీసుకోవడం గానీ చేయలేదు.మేం అధికారంలోకి వచ్చిన తర్వాత, ఇలాంటి పాత విషయాలపై ఆరోపణలు, విమర్శలు చేసి రాజకీయ లబ్ధి పొందాల్సిన అవసరం మాకేముంటుంది? మా దగ్గర స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి కాబట్టే ఈ విషయాలను ప్రస్తావిస్తున్నాం. జరిగిన వాస్తవాలు మాకు తెలిసి కూడా ప్రజలకు చెప్పకపోతే, భవిష్యత్తులో వారే మమ్మల్ని నిలదీస్తారు, 'మీకు తెలిసినా ఎందుకు మౌనంగా ఉన్నారు?' అని అడుగుతారు. అందుకే బయటకు వచ్చి మాట్లాడుతున్నాం.గత ఐదేళ్లలో హైందవ సంస్కృతి, మన ధర్మంపై వైసీపీ ప్రభుత్వం తరచుగా దాడులకు, అపవిత్ర కార్యాలకు తెగబడింది. అందుకే దీనిపై మాట్లాడాల్సిన, ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కనీసం జరిగిన తప్పులకు క్షమాపణ చెప్పాల్సింది పోయి, ఎదురు మాపైనే విమర్శలు చేస్తున్నారు. ఒకటే విషయాన్ని స్పష్టంగా చెప్తున్నాను... భగవంతుడి మీద పగ పెట్టుకున్నవాడు ఎవడైనా సరే సర్వనాశనం అయిపోతాడు. చరిత్రలో అలా బతికి బట్ట కట్టిన దాఖలాలు కూడా లేవు. ఈ విషయాన్ని అందరూ గుర్తుపెట్టుకోవాలి" అని పవన్ తీవ్ర హెచ్చరికలు చేశారు.

# తిరుమల లడ్డూపై దుష్ప్రచారం చేస్తున్నారు

**మొదటిపేజీ తరువాయి** – నివేదిక కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసిందని వారు తెలిపారు. ఉండవల్లిలో కూటమి నేతలు చేసిన విమర్శలకు కౌంటర్‌గా గురువారం ఢిల్లీలో వైసీపీ ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డి, గురుమూర్తి మీడియా సమావేశం నిర్వహించారు. రాజకీయ ప్రయోజనాల కోసం భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని వారు మండిపడ్డారు.లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిపారంటూ వచ్చిన ఆరోపణలపై సుప్రీంకోర్టు నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ జరిపి, అందులో నిజం లేదని తేల్చిందని వైసీపీ నేతలు గుర్తుచేశారు. ఆ తర్వాత సీబీఐ కూడా అదే నిర్ధారణకు వచ్చిందని పేర్కొన్నారు. అయినా, కూటమి ప్రభుత్వం కావాలనే విషప్రచారం చేస్తూ, ఫ్లెక్సీలు పెట్టి ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని వారు ఆరోపించారు.

**ఏ ప్రమాణానికైనా సిద్ధం: వైవీ సుబ్బారెడ్డి**

టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. తనపై చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదని, ఎలాంటి పరీక్షకైనా తాను సిద్ధమని సవాల్ విసిరారు. "నేను టీటీడీ చైర్మన్‌గా ఎలాంటి అవినీతికి పాల్పడలేదు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించే పనులు చేయలేదు. స్వామివారి సాక్షిగా ఏ ప్రమాణం చేయడానికైనా నేను రెడీ. అవసరమైతే దేవుడి ముందు సత్యశోధన (పాలిగ్రాఫ్) పరీక్షకు కూడా సిద్ధంగా ఉన్నాను" అని ఆయన స్పష్టం చేశారు. నెయ్యి సరఫరాను పెంచేందుకే నిబంధనలు సవరించామని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడలేదని వివరించారు. వివాదాస్పదమైన 'బోలె బాబా' కంపెనీ సరఫరా నిబంధనల సవరణకు ముందే జరిగిందని, అది కూడా టీడీపీ హయాంలోనే మొదలైందని గుర్తుచేశారు. తనపై ఆరోపణలు ఎదుర్కొంటున్న చిన్న అప్పన్న తన పీఏ కాదని, కేవలం ఏపీ భవన్‌లో లైజన్ ఆఫీసర్ మాత్రమేనని ఆయన తేల్చిచెప్పారు. వైసీపీ లోక్‌సభా పక్ష నేత మిథున్ రెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు రాజకీయ లబ్ధి కోసం పవిత్రమైన వెంకటేశ్వర స్వామిని కూడా వాడుకుంటున్నారని, ఇది ఘోరమైన తప్పని విమర్శించారు. "సిట్ నివేదిక చంద్రబాబు ఆరోపణలు అబద్ధమని తేల్చింది. దాన్ని జీర్ణించుకోలేక ఇప్పుడు మళ్లీ కొత్త కమిటీలు వేసి బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. వైవీ సుబ్బారెడ్డి గారు వెంకటేశ్వర స్వామికి పరమ భక్తుడు. అలాంటి వ్యక్తిపై ఇలాంటి నీచమైన ఆరోపణలు చేయడం దుర్మార్గం" అని మిథున్ రెడ్డి అన్నారు.

# వికసిత భారత్ లక్ష్యంగా దేశం ముందుకు సాగుతోంది

**మొదటిపేజీ తరువాయి** – రాజకీయ నాయకత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు అందలేదని నరవణే పేర్కొన్నారని, ఆ భాగాలను చదివి వినిపించేందుకు లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీకి అవకాశం ఇవ్వలేదని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇదే అంశంపై గత మూడు రోజులుగా లోక్‌సభ దద్దరిల్లుతోంది. బుధవారం లోక్‌సభలో మహిళా ఎంపీలు ప్లకార్డులతో నిరసన తెలపడంతో సభ వాయిదా పడి, ప్రధాని ప్రసంగం నిలిచిపోయింది.ఇవాళ రాజ్యసభలోనూ విపక్షాలు భగ్గుమన్నాయి. రాజ్యసభలో విపక్షాల నినాదాలు, అల్లరి మధ్యే ప్రధాని తన ప్రసంగాన్ని కొనసాగించారు. 'వికసిత భారత్' నిర్మాణంలో దేశం సరైన దిశలో వేగంగా పయనిస్తోందని అన్నారు. "గత కొన్ని సంవత్సరాలు దేశ వేగవంతమైన అభివృద్ధికి సాక్ష్యంగా నిలిచాయి. ప్రతి రంగంలోనూ ఇది మార్పుల యుగం" అని పేర్కొన్నారు. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలు వృద్ధాప్యంలోకి వెళుతుంటే, యువశక్తితో ఉరకలేస్తున్న భారత్ ప్రపంచానికి కొత్త ఆశను అందిస్తోందని వ్యాఖ్యానించారు. ఒకప్పుడు 11వ స్థానంలో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ, ఇప్పుడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా సాగుతోందని ధీమా వ్యక్తం చేశారు.అంతర్జాతీయంగా భారత్ ప్రతిష్ఠ పెరిగిందని, ఇటీవలే 9 కీలక వాణిజ్య ఒప్పందాలు కుదిరాయని ప్రధాని తెలిపారు. ముఖ్యంగా యూరోపియన్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా అభివర్ణించారు. గత కొన్నేళ్లుగా చేపట్టిన సంస్కరణల కారణంగా ప్రపంచ దేశాలు ఇప్పుడు భారత్‌తో వ్యాపారం చేయడానికి ఎంతో ఆసక్తిగా ఉన్నాయని స్పష్టం చేశారు. ప్రధాని మాట్లాడుతున్నంత సేపు విపక్ష సభ్యులు 'విపక్ష నేతను మాట్లాడనివ్వండి', 'నియంతృత్వం నశించాలి' వంటి నినాదాలతో హోరెత్తించారు. ఈ క్రమంలో ప్రధాని మోదీ, విపక్ష నేత మల్లికార్జున ఖర్గేపై సరదాగా వ్యాఖ్యలు చేశారు. "ఖర్గే జీ వయసు, సీనియారిటీని దృష్టిలో ఉంచుకుని ఆయన కూర్చునే నినాదాలు చేసేందుకు అనుమతి ఇవ్వాలి" అని ప్యానెల్ స్పీకర్ ను కోరుతున్నట్లు చమత్కరించారు. ఈ క్రమంలో విపక్షాలు సభ నుంచి నిష్క్రమించాయి. పార్లమెంటరీ సంప్రదాయాలను ప్రభుత్వం కాలరాస్తోందని విపక్షాలు ఆరోపిస్తుండగా, అభివృద్ధి అజెండానే తమకు ముఖ్యమని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

# ప్రాణాలకు తెగించి తెలంగాణ ప్రకటించారు

**మొదటిపేజీ తరువాయి** – చేశారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకువెళ్లాలని సూచించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన విధ్వంసాన్ని, కాంగ్రెస్ తెచ్చిన మార్పును ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు.తెలంగాణ ఏర్పాటు ప్రక్రియలో సోనియా గాంధీ చూపిన తెగువను సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ నష్టపోతుందని తెలిసినా, కేంద్రంలో అధికారం కోల్పోయే ప్రమాదం ఉన్నా, ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్రాన్ని ప్రకటించారని కొనియాడారు. ఆనాడు పెట్టుబడిదారుల నుంచి తీవ్ర ఒత్తిళ్లు వచ్చినా ఆమె చలించలేదని అన్నారు. పార్లమెంటులో పెప్పర్ స్ప్రే దాడులను సైతం లెక్కచేయకుండా పొన్నం ప్రభాకర్ వంటి నేతలు చేసిన పోరాటాన్ని, వారి త్యాగాలను ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి గుర్తుచేసుకున్నారు.మున్సిపల్ ఎన్నికల వేళ కార్యకర్తలకు, అభ్యర్థులకు సీఎం నూతనోత్సాహాన్ని నింపారు. టికెట్ కోసం తీవ్ర పోటీ ఉన్నప్పటికీ, పార్టీ అధిష్టానం నమ్మి ఇచ్చిన



అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టికెట్ దక్కని నాయకులను కలుపుకొని పోవాల్సిన బాధ్యత అభ్యర్థులదేనని స్పష్టం చేశారు. ఒక్క ఓటు కూడా ఫలితాన్ని తారుమారు చేస్తుందని, అందుకే అలసత్వం వద్దని హెచ్చరించారు. గత ప్రభుత్వం ఇవ్వని రేషన్ కార్డులు, సన్న బియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలే కాంగ్రెస్ విజయానికి నాంది అని తెలిపారు. మనం చేసిన పనులే ప్రజలకు చెప్పాలని, అబద్ధాలు ఆడాల్సిన అవసరం మనకు లేదని హితవు పలికారు.గత పదేళ్లలో బీఆర్ఎస్ పాలన కేవలం ఆస్తులు కూడబెట్టుకోవడానికే పరిమితమైందని రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుందని, పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు గానీ, దళితులకు మూడు ఎకరాల భూమి గానీ ఇవ్వకుండా మోసం చేశారని విమర్శించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనే 25 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించిన చరిత్ర కాంగ్రెస్‌దని గుర్తుచేశారు. ఉచిత విద్యుత్ పథకంపై పేటెంట్ హక్కు కాంగ్రెస్ పార్టీదేనని, రైతులపై కేసులు ఎత్తివేసి, విద్యుత్ బకాయిలు రద్దు చేసిన ఘనత తమకే దక్కుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న మంచిని చూసి ఓర్వలేక ప్రతిపక్షం విషం చిమ్ముతోందని మండిపడ్డారు.

# బొగ్గు గనిలో పేలుడు...

**మొదటిపేజీ తరువాయి** – మేఘాలయలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. తాష్లే ప్రాంతంలోని ఓ బొగ్గు గనిలో గురువారం పేలుడు సంభవించడంతో, కనీసం 10 మంది కార్మికులు మరణించారు. ఈ దుర్ఘటనతో స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది.వార్తా సంస్థల కథనాల ప్రకారం, గని లోపల ఈ పేలుడు జరగడంతో కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతులంతా అసోం రాష్ట్రానికి చెందిన వలస కార్మికులుగా అధికారులు అనుమానిస్తున్నారు. వీరిలో ఒకరిని కటిగొరా ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మిగతా వారి వివరాలు తెలియాల్సి ఉంది.ఈ దుర్ఘటన గురించి తెలియగానే మేఘాలయ పోలీసులు, సహాయక బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నాయి. గనిలోపల చిక్కుకున్న వారిని బయటకు తీసుకొచ్చేందుకు సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగిస్తున్నాయి. మేఘాలయలో తరచూ జరుగుతున్న చట్టవిరుద్ధమైన 'ర్యాట్-హోల్' మైనింగ్ వల్లే ఇలాంటి ప్రమాదాలు పునరావృతం అవుతున్నాయని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు ప్రారంభమైంది. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై అధికారులు పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

# అమెరికా గుండెల్లో 'ఇరాన్' రైళ్లు

**మొదటిపేజీ తరువాయి** – పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న వేళ ఇరాన్ తన సైనిక పరాక్రమాన్ని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది. అమెరికాతో గరిష్ఠ స్థాయి ఉద్రిక్తతలు నెలకొన్న తరుణంలో ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఒక అత్యాధునిక 'అండర్ గ్రౌండ్ మిస్సైల్ బేస్'ను ఆవిష్కరించింది. ఇరాన్ సైనిక దళాల అధిపతి అబ్దొల్రహీమ్ మౌసవి బుధవారం ఈ కేంద్రాన్ని సందర్శించి, క్షిపణి యూనిట్ల సన్నద్ధతను స్వయంగా పరిశీలించారు.ముఖ్యంగా, ఇరాన్ తన సైనిక సిద్ధాంతాన్ని రక్షణ నుంచి దాడుల శైలికి మార్చినట్లు మౌసవి ప్రకటించడం అంతర్జాతీయంగా సంచలనం రేపుతోంది. గత ఏడాది ఇజ్రాయెల్‌తో జరిగిన 12 రోజుల యుద్ధం తర్వాత, కేవలం ఎదురుదాడి చేయడమే కాకుండా.. శత్రువుపై మెరుపు వేగంతో విరుచుకుపడేలా తమ క్షిపణి సామర్థ్యాన్ని పెంచుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అమెరికా గనుక ఏ చిన్న తప్పు చేసినా, ఆ ప్రాంతంలో ఉన్న అమెరికా పౌరులకు కానీ, వారి స్థావరాలకు కానీ రక్షణ ఉండదని ఘాటుగా హెచ్చరించారు.ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో అమెరికా తన విమాన వాహక నౌకలను మోహరించడంతో పాటు, ఇరాన్ డ్రోన్లను కూల్చివేస్తూ ఒత్తిడి పెంచుతోంది. మరోవైపు, ఒమన్‌లో ఇరు దేశాల మధ్య రహస్య చర్చలు జరగనున్నాయన్న వార్తల నడుమ.. ఇరాన్ తన భూగర్భ క్షిపణి నగరాన్ని బయటపెట్టడం ద్వారా వాషింగ్టన్‌కు ఒక బలమైన సంకేతం పంపింది.

# మరో రెండేళ్లలో కేసీఆర్ సీఎం అవుతారు

**మొదటిపేజీ తరువాయి** – చూసుకునే వారికే ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.ఒకప్పుడు పందులతో ఉన్న గజ్వేల్ ఆసుపత్రి కేసీఆర్ వచ్చాక ఎలా అయిందో అందరూ గుర్తుంచుకోవాలని అన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఎన్నో హామీలు ఇచ్చింది కానీ వాటిని అమలు చేయలేదని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కల్యాణ లక్ష్మి ఇవ్వలేదు కానీ బంగారం ధర మాత్రం భారీగా పెరిగిందని అన్నారు. అప్పుడు బంగారం ఆశపెట్టిన ముఖ్యమంత్రి ఇప్పుడు మాట్లాడటం లేదని విమర్శించారు.కేసీఆర్, బీఆర్ఎస్ నాయకులపై తిట్ల వర్షం కురిపించడం తప్ప రేవంత్ రెడ్డికి తెలిసిందేమీ లేదని అన్నారు. ఈ రెండున్నరేళ్ల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం గజ్వేల్‌లో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని ఆరోపించారు. ఎన్నికల తర్వాత రైతు బంధు ఇస్తామని ముఖ్యమంత్రి అంటున్నారని, కానీ ఈ నెల 11 లోపు ఇవ్వకపోతే ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధైర్యం ఉంటే అభివృద్ధి విషయంలో కేసీఆర్‌తో పోటీ పడాలని సవాల్ చేశారు.ం

## తెలంగాణను రక్షించుకోవాలంటే బీజేపీకి ఓటు వేయాలి

**మొదటిపేజీ తరువాయి** – తెలంగాణను రక్షించుకోవాలంటే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఇన్నాళ్లు తెలంగాణలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలేనని, ఏపీలో విమానాశ్రయాలు ఉన్నాయి కానీ తెలంగాణలో ఎందుకు లేవని ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఏం చేసిందని ప్రశ్నించారు.కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ బంగారు బాతు అయిందని విమర్శించారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా, తెలంగాణ నుంచే డబ్బులు వెళుతున్నాయని ఆరోపించారు. తెలంగాణను కాపాడుకోవాలంటే బీజేపీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు ఉన్న విషయం తెలిసిందే.

# న్యాయవాదులు చేసిన పాపం ఏమిటి?

**వృత్తి ధర్మాన్ని నిర్వహించడమా?**

**కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్ యాదవ్ సూటి ప్రశ్న?**

**నారాయణపేట ,ఫిబ్రవరి 05 (తొలివార్త ) :** నారాయణపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిన్న మొహీనాబాద్ కు చెందిన మహిళ న్యాయవాది స్వప్న దారుణ హత్యకు నిరసనగా ఈరోజు బార సోషల్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్ అధ్యక్షతన నారాయణపేట న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి గేట్ ధర్నా నిర్వహించారు. ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న న్యాయవాదులను మరియు ప్రజలను ఉద్దేశించి అధ్యక్షుడితో పాటు మాజీ అధ్యక్షులు రాజేశ్వర్గౌడ్ , ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి , కోశాధికారి కృష్ణ గౌడ్, న్యాయవాదులు కే నర్సింలు , ఈ దారుణ ఉదంతాన్ని ఖండిస్తూ న్యాయవాద పరిరక్షణ చట్టం యొక్క అవసరాన్ని వివరిస్తూ ప్రసంగించారు.ఈ ధర్నాను ఉద్దేశించి ప్రసంగించిన ప్రభుత్వ న్యాయవాది రఘువీర్ యాదవ్ మాట్లాడుతూ న్యాయవాదులు చేసిన పాపం ఏమిటి అని, ఆనాడు వామన్ రావు దంపతుల జంట



మొదలుకొని నిన్నటి చేవెళ్ల కోర్టు పరిధిలో నివాసి అయిన మహిళా న్యాయవాది స్వప్న దారుణ హత్య వరకు న్యాయవాదులపై వరుసగా దాడులు మరియు హత్యలు ఈ రాష్ట్రంలో జరుగుతూనే ఉన్నాయని, పైగా వీటి నివారణ కోసం ఉద్దేశించబడిన న్యాయవాద పరిరక్షణ చట్టం కోసం ముఖ్యమంత్రి ఛాంబర్ లో పెండింగ్లో ఉన్న బిల్లు రకరకాల కారణాలతో వాయిదా పడుతూనే ఉందని పర్యవసరంగా మరెన్నో దాడులను న్యాయవాదులు ఎదుర్కోవలసి వస్తుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు.ఈనాటి ముఖ్యమంత్రి ఆనాడు పిసిసి అధ్యక్షునిగా నారాయణపేట కోర్టు ఆవరణలో అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ కొరకు జరుగుతున్న న్యాయవాదుల దీక్షా శిబిరాన్ని సందర్శించి ఇచ్చిన హామీని, ఈరోజు వారి మిత్రుడు దేవరకద్ర ఎమ్మెల్యే , అలంపూర్ న్యాయవాదుల పాదయాత్ర ముగింపు సభలో భూత్పూర్ లో తిరిగి గుర్తు చేసినప్పటికీ పెండింగ్లో ఎందుకు వేస్తున్నారు న్యాయవాదులు ఇంకా ఎంతమంది బలి కావాలి అని ప్రశ్నించారు? మిగతా సీనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ సంఘటన ఉద్యమం మరింత తీవ్రతం చేయాలని సూచించగా బారాసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జిల్లా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న భారతదేశంలో అధ్యక్షులు మాట్లాడుకుని అంతిమ పోరాటం చేయడానికి సిద్ధమవుతున్నామని న్యాయవాదులు సహకరించాలని కోరినారు.

# అన్ని పార్టీల మద్దతుతో గెలిపు దిశగా తుమ్మేటి పాండు

**భువనగిరి మున్సిపాలిటీ చరిత్రలో ఒక కొత్త అధ్యాయనం**

**సృష్టించనున్న 14 వార్డు అభ్యర్థి**

**వార్డు అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తా**

**14 వ వార్డు స్వతంత్ర అభ్యర్థి తుమ్మేటి పాండు యాదవ్**

**యాదాద్రి భువనగిరి ఫిబ్రవరి 05 (తొలివార్త )జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పురపాలక సంఘం పరిధిలోని స్థానిక 14వ వార్డు స్వతంత్ర అభ్యర్థి తుమ్మేటి పాండు యాదవ్ అన్ని పార్టీ నాయకుల మద్దతుతో భువనగిరి పట్టణ 14వ వార్డు నుండి పోటీలో ఉన్నానని ఈనెల 11న జరగబోయే మున్సిపాలిటీ ఎన్నికలలో భాగంగా గురువారం రోజు తన భార్య లావణ్య కుటుంబ సభ్యులతో కలసి వార్డులో విశృత ప్రచారాన్ని నిర్వహించారు. 14వ వార్డు స్వతంత్ర అభ్యర్థి బ్యాలెట్ పేపర్ లో ఉన్న సీరియల్ నెంబర్ 2పై ఉన్న ఉంగరం గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించగలరని వార్డు ప్రజలను కోరారు. ఈ



సందర్భంగా పాండు మాట్లాడుతూ వార్డులో ప్రధానంగా నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని , వార్డులో పెన్షన్లు రానివారికి వచ్చేలా కృషి చేస్తానని , కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను అన్నింటిని వార్డులో ఉన్న అర్హులందరికీ అందేలా చూస్తానని ఈ సందర్భంగా నాకు మద్దతు తెలుపుతున్న అధికార కాంగ్రెస్ పార్టీ , భారత రాష్ట్ర సమితి , భారతీయ జనతా పార్టీ , సిపిఐ , సిపిఎం ఇతర పార్టీల మద్దతుతో మీ ముందుకు వస్తు



న్నానని వార్డు ప్రజల వద్దకు స్వతంత్ర అభ్యర్థి తుమ్మేటి పాండు లావణ్య కుటుంబ సభ్యులు వెళ్లి ఓటర్ మహాశయులను తమకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు ఈ కార్యక్రమంలో గోమరి సుధాకర్ రెడ్డి , గోమరి మోహన్ రెడ్డి , గోమరి పద్మారెడ్డి , అంకర్ల వెంకటేష్ , జగదీష్ ,తుమ్మేటి చంద్రయ్య , మర్రి పాండు యాదవ్ , గణేష్ యాదవ్ , ఎం. గణేష్ , టి.మహేష్ , కే. నరసింహ , రాఘ వేంద్ర రెడ్డి వార్డు ప్రజలు ఇతర పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అశ్వాపురం,పంచాయతీలో గ్రామసభ ఏర్పాటు,పారిశుద్ధ కార్మికులకు శానిటేషన్ కిట్లు పంపిణీ

**భద్రాద్రి జిల్లా ఫిబ్రవరి 5 (తొలి వార్త) :** అశ్వాపురం,గ్రామపంచాయతీలో సర్పంచ్ బానోత్ సదర్ లాల్ అధ్యక్షత న గ్రామసభ – ను గురువారం నాడు, విజయవంతంగా నిర్వహించారు. ఈ సమావేశానికి గ్రామ స్థాయి అధికారులు,ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు,అంగన్వాడీ టీచర్లు, స్కూల్ హెచ్ఎంలు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, రెవెన్యూ అధికారులు తదితరులు హాజరై గ్రామాభివృద్ధి అంశాలపై చర్చించారు.ఈ గ్రామసభలో గ్రామ పంచాయతీలో ఈ సందర్భంగా, పనిచేస్తున్న 21 మంది పారిశుద్ధ్య కార్మికులకు శానిటేషన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా, గ్రామంలో అమలు చేయాల్సిన పలు అభివృద్ధి పనులు సీ.సీ రోడ్లు, డ్రైనేజీలు, ప్రతి విధి బజార్లలో నీ, చెత్త మరియు ముళ్ళకంపా,పిచ్చి మొక్కలు తొలగించాలని. మొదలగు కార్యక్రమాలపై విస్తృతంగా చర్చ



జరిగింది. ముఖ్యంగా వీధుల్లో విద్యుత్ స్తంభాలు లేని ప్రాంతాలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.అదేవిధంగా గ్రామపంచాయితీ బిల్డింగ్ నిర్మాణ స్థలం గురించి, గ్రామంలోని డ్రైనేజ్ సమస్యలపై గ్రామ పంచాయతీ అధికారులతో కలిసి చర్చించి,బజార్ ప్రాంతాలు సహా పలు వీధుల్లో ఉన్న డ్రైనేజ్ ఇష్యూలను పరిష్కరించాల్సిన అవసరాన్ని సభ్యులు ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తుళ్లూరి ప్రకాష్ రావు గ్రామపంచాయతీ సెక్రటరీ, దాసరి మల్లేశం, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం, పి.వెంకటేశ్వరావు, ఫారెస్ట్ ఆఫీసర్ ధనలక్ష్మి, వ్యవసాయ శాఖ ఏఈఓ డి.రమాదేవి, అశ్వాపురం గ్రామ వార్డు సభ్యులు వేములపల్లి హసిత,కోర్సా ముత్తమ్మ, నూకల లింగయ్య, చింతల అనుపమ,చిక్క పద్మ,బానోతు పద్మ కుమారి, చెట్టుపల్లి కుమారి ఫీల్డ్ ఆఫీసర్ లక్ష్మణ్, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, గ్రామ పెద్దలు నాయకులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్న మంత్రి పొంగులేటి

**వెల్లడించిన,కాంగ్రెస్ పార్టీ ఎన్నికల**

**సమన్వయకర్త,తుళ్లూరి బ్రహ్మయ్య**

**భద్రాద్రి జిల్లా ఫిబ్రవరి 5 (తొలి వార్త) :** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా, ఈ సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ డిసిసిబి డైరెక్టర్,మరియు కాంగ్రెస్ పార్టీ కొత్తగూడెం ఎన్నికల సమన్వయకర్త తుళ్లూరి బ్రహ్మయ్య,ఈ సందర్భంగా విలేకరులు,మీడియా సమావేశంలో,మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,పాల్గొననున్న ఎన్నికల ప్రచార పర్యటన వివరాలను వెల్లడించారు.తేదీ : 06-02-2026 (శుక్రవారం) రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణ మరియు సమాచారపౌర సంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి మన పాల్వంచ పట్టణ పరిధిలోని వివిధ డివిజన్లలో “కార్నర్ మీటింగ్స్” లో పాల్గొంటారు.ఉదయం 8.00 గంటలకు మీటింగ్ సెంటర్ : గాంధీనగర్ పాల్గొనవలసిన డివిజన్లు :31. మంచికంటినగర్32. గాంధీనగర్33. శేఖరం బంజర్48. సంజయనగర్ ఉదయం 8-30గంటలకు మీటింగ్ సెంటర్ : పాత పాల్వంచపాల్గొనవలసిన డివిజన్లు : 35. సీతారామపట్నం 45. కొమ్ముగూడెం (గొల్లగూడెం) 46. పాత పాల్వంచ47. 47. పాత పాల్వంచ 48. ఉదయం 9-00గంటలకు మీటింగ్ సెంటర్ : అంబేద్కర్ సెంటర్ పాల్గొనవలసిన డివిజన్లు :40. రాజీవ్ మార్కెట్41. బాపూజీనగర్42. వికలాంగుల కాలనీ 43. నెహ్రూనగర్44. శ్రీనగర్ కాలనీ ఉదయం 9-30గంటలకు మీటింగ్ సెంటర్ : నటరాజ్ సెంటర్ పాల్గొనవలసిన డివిజన్లు : 01 బొల్లోరుగూడెం 34 కరకవాగు 36 గట్టాయిగూడెం 37 శాస్త్రి రోడ్, బ్రాహ్మణబజార్ 38 ఒడ్డుగూడెం, టీచర్స్ కాలనీ 39 చాకలి బజార్, ఓల్డా గాంధీనగర్ ఉదయం 10-00 గంటలకు,మీటింగ్ సెంటర్ : వెంగళరావు కాలనీ,పాల్గొనవలసిన డివిజన్లు :02. ప్రశాంతినగర్, కేటీపీస్ కాలనీ03. వెంగళరావు కాలని మధ్యాహ్నం 10-30 గంటలకుమీటింగ్ సెంటర్ : ఇందిరా కాలనీపాల్గొనవలసిన డివిజన్లు :04. కేటీపీస్, రాహుల్గాంధీనగర్ 05.కాంట్రాక్టర్స్, హమాలీ కాలనీలు06. ఇందిరాకాలనీ 07. జయమ్మకాలనీ, వనమాకాలనీ, మధ్యాహ్నం 11-0గంటలకు మీటింగ్ సెంటర్ : శ్రీనివాస కాలనీపాల్గొనవలసిన డివిజన్లు : 08. శ్రీనివాసకాలనీ, కుంటినాగుల గూడెం, అయ్యప్పనగర్ 09. పేటచెరువు,పిల్లవాగు, కొత్తూరు,



గుడిపాడు, బంగారుజాల,కావున ఆయా డివిజన్ల అభ్యర్థులు, పార్టీ ఇన్చార్జీలు అందరూ బాధ్యతతో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తుళ్ళూరి బ్రహ్మయ్య కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త,విజ్ఞప్తి చేశారు.

# మహిళా స్వయం సహాయక సంఘాలకు మహర్దశ: జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**జడ్చర్ల ఫిబ్రవరి 5 ( తొలివార్త) :** రూ.8.40 కోట్లతో గ్రామ మహిళా సంఘాలకు భవనాలు 6 మండలాల్లో 84 భవనాల మంజూరు: ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళా సంఘాలకు చెందిన 84 గ్రామైక్య సంఘాల (వీఓలు)కు రూ.8.40 కోట్ల వ్యయంతో సొంత భవనాలను నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి తెలిపారు.మహిళా సాధికారత సాధనలో గ్రామ మహిళా సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్న ఎమ్మెల్యే, వీటికి సొంత భవనాలు ఏర్పడితే మహిళల అభివృద్ధికి మరింత తోడ్పాటు లభిస్తుందన్నారు.జడ్చర్ల నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లో ఈ భవనాల నిర్మాణం మంజూరైందని గురువారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద ఒక్కో భవనాన్ని రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్నట్లు చెప్పారు.మండలాల వారీగా మంజూరైన భవనాలు: ఊర్కొండ 16, మిడ్జిల్ 5, రాజాపూర్ 8, బాలానగర్ 17, జడ్చర్ల 14, నవాబుపేట 24, ఊర్కొండ మండలంలోని బొమ్మరాసుపల్లి, గుడిగానిపల్లి, గండ్లగుంటపల్లి, ఇప్పలపాడు, జగబోయినపల్లి, జకినాలపల్లి, లోక్యాతాండా, మాచారంపల్లి, మాదారం, నర్సంపల్లి,



రాచాలపల్లి, రన్రెడ్డిపల్లి, రేవల్లి, తిమ్మన్పల్లి, ఊర్కొండ, ఊర్కొండపేట గ్రామాల్లో వీఓ భవనాలు మంజూరయ్యాయి.మిడ్జిల్ మండలంలోని మసిగుండ్లపల్లి, ఈదులబాయి తాండా, బోయిన్పల్లి, వేముల, మిడ్జిల్ గ్రామాల్లో భవనాల నిర్మాణానికి అనుమతి లభించింది.బాలానగర్ మండలంలోని హేమాజీపూర్, గాంధీపాలెం, గంగాధరపల్లి, మోతీఘనపూర్, నేరెళ్లపల్లి, కేతిరెడ్డిపల్లి, గాలిగూడ, చింతకుంట తాండ, పెద్దాయిపల్లి, మాచారం, మోదంపల్లి, వీరన్నపల్లి, సూరారం, గుండేడ్, గౌతాపూర్, ఉడిత్యాల, చిన్నరేవల్లి గ్రామాల్లో వీఓ భవనాలు మంజూరయ్యాయి.జడ్చర్ల మండలంలోని ఆలూరు, అమ్మపల్లి కాలనీ, బండమీదిపల్లి, చిన్న ఆదిరాల, గొల్లపల్లి, గోప్లాపూర్, కిష్టంపల్లి, మాచారం, మల్లెబోయిన్పల్లి, నెక్కొండ, పెద్దపల్లి, లింగంపేట్, కిష్టారం, కొత్త తాండా గ్రామాలకు భవనాలు మంజూరయ్యాయి.నవాబుపేట మండలంలోని చౌదూరు, పల్లెగడ్డ, కొండాపూర్, యన్మన్గండ్ల, కామారం, దొడ్డిపల్లి, దర్పల్లి, గురుకుంట, దయాపంతులపల్లి, అమ్మాపూర్, దేపల్లి, కారూర్, రుద్రారం, కొల్లూర్, హాజీపూర్, కాకర్జాల, కేశవరావుపల్లి, హనుమన్నానిపల్లి, తిమ్మాయిపల్లి, కాకర్లపాడు, సిద్ధోటం, కిషన్గూడ, ఊరంచుతాండ గ్రామాలకు కూడా వీఓ భవనాలు మంజూరు అయ్యాయని వివరించారు.గ్రామీణ ప్రాంతాల్లో భూమి అందుబాటులో ఉన్న చోట్ల ఈ భవనాల నిర్మాణం చేపడతామని తెలిపారు. మొత్తం 84 భవనాలను రూ.8.40 కోట్ల వ్యయంతో నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.


# ఆర్టిఏ ఆఫీసు వద్ద కారు లో తరలిస్తున్న,15.070 కేజీ ల ఎండు గంజాయి స్వాధీనం



**భద్రాద్రి జిల్లా ఫిబ్రవరి 5 (తొలి వార్త) :** ఖమ్మం ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్, సీఐ సిహెచ్.శ్రీనివాస్ సిబ్బంది కలిసి ఆర్టిఏ ఆఫీసు భద్రాచలం వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమా నాస్పదంగా వస్తున్న ఒక (టీ జీ 08 హెచ్ క్యూ 9088) గల కారును ను ఆపి తనిఖీ చేయగా దానిలో 15.070 కేజీ ల గంజాయి ఉన్నట్లు గుర్తించారు.ఈ గంజాయి ఒరిస్సా నుంచి హైదరాబాద్కు తరలి స్తున్నట్లుగా నిందితుల విచారణలో వెల్లడయ్యింది.ఈ గంజాయి కేసులో, ఎ 1) రఘు విష్ణోయి గోవర్ధన్ జీడిమెట్ల,రంగారెడ్డి (జిల్లా),ఎ 2) శేఖర్ రామ్ పోకర్ రామ్ జోధ్ పూర్,రాజస్థాన్ లు ఒడిశా రాష్ట్రం లోని మల్కాన్ గిరి నుండి హైదరాబాద్ కు తరలిస్తూ పట్టుబడినారు. తదుపరి విచారణ నిమిత్తం ఇట్టి నిందితుల వద్ద గంజాయి, స్వాధీనం,1 కారు ,2 సెల్ ఫోన్లు మరియు ఇద్దరు ముద్దాయిలు పట్టుబడ్డారు.(వీటి మొత్తం విలువ రూ.10,73,500) భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్ లో అప్పగించడమైనది.ఈ తనిఖీలలో కానిస్టేబుల్స్ సుధీర్, వెంకట్, హరీశ్,విజయ్ వీరబాబు,ఉపేందర్ లు పాల్గొన్నారు. ది.05-02-2026 తేదీన గురువారం నాడు గంజాయిని పట్టుకున్న అధికారులు, ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జి.జనార్ధన్ రెడ్డి,అసిస్టెంట్ కమిషనర్ జి.గణేష్ ,ఈ ఎస్, కె.తిరుపతి, అభినందించారు.నోట్: ఏదైనా గంజాయి కి సంబంధించిన సమాచారం ఉన్నచో టోల్ ఫ్రీ నెంబర్ 180042 52523 కు సమాచారం అందించగలరని,మీ వివరాలు గోప్యం గా ఉంచబడతాయి అని సిఐ, తెలియజేశారు.

# ప్రముఖ నటి జయావాహిని కన్నుమూత

**చిత్రసీమలో విషాదం**



**హైదరాబాద్ ఫిబ్రవరి 5 ( తొలివార్త) :** తెలుగు వెండితెర మరియు బుల్లితెర నటి జయావాహిని (పద్మక్క) బుధవారం సాయంత్రం కన్నుమూశారు. గత కొంతకాలంగా రొమ్ము క్యాన్సర్ తో పోరాడుతున్న ఆమె పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని ప్రముఖ నటి కరాటే కళ్యాణి సోషల్ మీడియా వేదికగా ధ్రువీకరించారు.జయావాహినిని రక్షించేందుకు శతవిధాలా ప్రయత్నించామని, కానీ ఫలితం లేకుండా పోయిందని కళ్యాణి ఆవేదన వ్యక్తం చేశారు. ‘రఘుపతి వెంకయ్య నాయుడు‘, ‘బహిర్భూమి‘, ‘పోలీస్ వారి హెచ్చరిక‘ వంటి చిత్రాల్లో ఆమె కీలక పాత్రలు పోషించారు. సినిమాలతో పాటు పలు ప్రజాదరణ పొందిన సీరియళ్లలో నటించి ‘పద్మక్క‘గా ప్రేక్షకులకు చేరువయ్యారు.ఆమె మృతి పట్ల టాలీవుడ్ ప్రముఖులు, సహనటులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ నివాళులర్పించారు.

# ఉప్పసాక పంచాయతీలో అభివృద్ధి పనులను సమీక్షించిన

**బూర్గంపాడు ఎంపీడీఓ జమలారెడ్డి**



**భద్రాద్రి జిల్లా ఫిబ్రవరి 5 (తొలి వార్త) :** బూర్గంపహాడ్ మండలపరిధిలోని ఉప్పసాక పంచాయతీ నందు సర్పంచ్ వర్సా మంగమ్మ నేతృత్వంలో గ్రామంలో జరుగుతున్న పలు ఇందిరమ్మ ఇండ్ల గృహ నిర్మాణ పనులు మరియు గ్రామాలలోని రోడ్లు పనులను అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పనులతీరును సమీక్షించిన బూర్గంపహాడ్ మండల ప్రజాపరిషత్ అభివృద్ధాధికారి జమలా రెడ్డి , ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ మరియు వార్డు మెంబర్లు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం





**తొర్రూరు ఫిబ్రవరి 05(తొలివార్త) :** తొర్రూరు మున్సిపాలిటీ 01వ వార్డులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి తాళ్లపల్లి శ్రీలత రమేష్ గెలుపు కోసం పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి విస్తృతంగా ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రతి ఇంటిని సందర్శించి స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు.. కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం, పట్టణాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తోందని వివరించి, మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తాళ్లపల్లి శ్రీలత రమేష్ .భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.01వ వార్డులో త్రాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి సారిస్తుందని అన్నారు తాళ్లపల్లి శ్రీలత రమేష్ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వార్డు అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, 01వ వార్డు అధ్యక్షులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, యువజన విభాగం ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.

# తొర్రూరు మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం





**తొర్రూర్ ఫిబ్రవరి 05(తొలివార్త) :** తొర్రూరు మున్సిపాలిటీ 07వ వార్డులో కాంగ్రెస్ ఇంటింటి ప్రచారశీ తొర్రూరు మున్సిపాలిటీ ఎన్నికలలో భాగంగా 07వ వార్డులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి జీలుకర సురేందర్ గారి గెలుపు కోసం టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ శ్రీమతి ఝాన్సీ రాజేందర్ రెడ్డి విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు ప్రతి ఇంటిని సందర్శించి స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం, పట్టణాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తోందని రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీలుకర సురేందర్ భారీ మెజారిటీతో గెలిపించాలని అన్నారు.జీలుకర సురేందర్ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వార్డు అభివృద్ధికి పనిచేస్తారని త్రాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్యం అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, 07వ వార్డు6 అధ్యక్షులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, యువజన విభాగం నాయకులు ప్రజ ప్రతినిధులు పాల్గొన్నారు.

# వందరోజు పనులు ప్రారంభించిన గొందిగూడెం కొత్తూరు గ్రామ పంచాయతీ

**సర్పంచ్ కోండ్రు అంజమ్మ**




**భద్రాద్రి జిల్లా ఫిబ్రవరి 5 (తొలి వార్త) :** అశ్వాపురం మండలంలోని గొందిగూడెం కొత్తూరు గ్రామంలో గురువారం,నాడు గ్రామపంచాయతీ, సర్పంచ్ కొంద్రు.అంజమ్మ,100 రోజుల ఉపాధి హామీ పనులను ప్రారంభించారు, ఈ సందర్భంగా సర్పంచ్ కోంద్రు.అంజమ్మ, మాట్లాడుతూ గొంది గూడెం కొత్తూరు గ్రామం నుండి ప్రజలెవరు కూలీ పనుల నిమిత్తం కొరకు వేరే ప్రాంతాలకు గాని గ్రామాలకు వలస కూలీలుగా వెళ్లకుండా నివారించటానికి, గ్రామంలో ప్రజలకు జీవనోపాధి కొరకు వందరోజుల ఉపాధి హామీ పనులను ప్రారంభించామని ఆమె తెలిపింది,ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎడమ సురేష్ మరియు వార్డు మెంబర్లు చాప నరేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొంద్రు రామచంద్రయ్య, బండ్ల ముత్తయ్య, మడకం వసంత రావు, కారం నర్సింహా రావు, వందరోజు పనులకు వెళ్లేవారు తదితరులు పాల్గొన్నారు.

# చౌటుప్పల్ మున్సిపాలిటీ 12వ వార్డు అభ్యర్థి పాక చిరంజీవి గెలుపుకై ఉప్పలమ్మ గుడి లో ప్రత్యేక పూజలు

**పూజలో పాల్గొన్న 12వ వార్డు అధ్యక్షులు,వార్డు ఇన్చార్జిలు,కాంగ్రెస్ పార్టీ నాయకులు**






**చౌటుప్పల్ ,ఫిబ్రవరి 05 (తొలివార్త) :** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ లోని 12వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాక చిరంజీవి యాదవ్ గెలుపు కొరకై 12వ వార్డులో ఉన్న ఉప్పలమ్మ తల్లి గుడి వద్ద 12వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెరుకు లింగస్వామి గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను స్థానిక మార్కెట్ కమిటీ అధ్యక్షులు ఉబ్బు వెంకటయ్య,మాజీ జెడ్పిటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ బొంగు జంగయ్య గౌడ్,శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం అధ్యక్షులు బొబ్బిళ్ళ మురళి గురుస్వామి,తిరుపతి రవీందర్,12వ వార్డు ఇన్చార్జులు బక్క శ్రీనాథ్,మాదగొని శేఖర్ గౌడ్,మాజీ వార్డ్ మెంబర్ ఎస్.కే జానీ బాబు,చౌటుప్పల్ మాజీ ఉపసర్పంచ్ పాలడుగు వెంకటేష్ గుప్తా,మాజీ వార్డ్ మెంబర్ బుంగపట్ల భారతమ్మ,బొబ్బిళ్ళ కుమార్ మరియు ఇందిరమ్మ కమిటీ సభ్యుల సమక్షంలో పూజా కార్యక్రమాలను నిర్వహించి ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా 12వ వార్డు అధ్యక్షులు చెరుకు లింగస్వామి గౌడ్ ఆధ్వర్యంలో కొంతమంది స్థానిక బిఆర్ఎస్ పార్టీకి చెందినటువంటి మహిళలు రెడ్డితిరు లక్ష్మి,కవిత మంగమ్మ,మీనా,సుజాత,కృష్ణమ్మ,లావణ్య,మౌనిక, మహేశ్వరి,వసంత తదితర 15 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీ లో చేరారు.ఈ కార్యక్రమంలో 12వ వార్డు శాంతినగర్అకు చెందిన ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి అధికారులకు ఆదేశం

## జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**భద్రాద్రి జిల్లా ఫిబ్రవరి 5 (తొలి వార్త) :** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలు సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ లోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా జనవరి నెలలో 49 రోడ్డు ప్రమాదాలు జరగగా 17 మంది మృతి చెందినట్లు తెలిపారు. ప్రమాదాలు జరిగిన ప్రదేశాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో మరొక్క ప్రాణం పోకుండా తక్షణమే అవసరమైన అన్ని నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి నెల ప్రమాదాల వివరాలను సమీక్షిస్తూ, ప్రమాదాలకు దారి తీసే కారణాలను గుర్తించి వాటి నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.రహదారుల మరమ్మతుల కోసం ప్రత్యేకంగా రోడ్డు రిపేర్ గ్యాంగ్‌ను ఏర్పాటు చేయాలని, రహదారుల మరమ్మతులకు అవసరమైన సామాగ్రి,పనిముట్లు, వనరులపై సమగ్ర నివేదికలు సమర్పించాలని సూచించారు. ప్రమాదాలకు కారణమయ్యే గుంతలు,దెబ్బతిన్న రహదారులు, సూచికల లేమి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పాఠశాలల్లో మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలు, రహదారి భద్రత అంశాలపై అవగాహన కల్పించే వీడియోలు, చిత్రాలను ప్రదర్శించాలని ఆదేశించారు. ఎన్సీసీ విద్యార్థుల ద్వారా హెల్మెట్ వినియోగంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.ప్రతి బ్లడ్ బ్యాంకులో రక్త నిల్వలపై క్రమం తప్పకుండా నివేదికలు అందించాలని, ఎక్కడైనా రక్త కొరత ఉన్నట్లయితే వెంటనే రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రహదారి ప్రమాదాలు జరిగిన అత్యవసర సమయాల్లో బాధితులకు తక్షణ వైద్య సేవలు అందేలా వైద్య శాఖ అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు.జిల్లా వ్యాప్తంగా సమగ్ర ట్రాఫిక్ మేనేజ్మెంట్ ప్లాన్ రూపొందించాలని, ఎక్కడ సిగ్నల్ లైట్లు అవసరమో, డైవర్షన్లు, డివైడర్లు, ప్రమాద సూచికలు తదితర అంశాలపై మున్సిపల్ కమిషనర్లు వివరమైన నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. జాతీయ రహదారులపై చేపడుతున్న మరమ్మతులు, కనెక్టివిటీ రహదారుల పనులను రెండు వారాల్లో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, ఈ సందర్భంగా మాట్లాడుతూ,ప్రమాదాలు జరిగిన ప్రదేశాల్లో నిర్ణీత కాలపరిమితిలో తగిన చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 38 బ్లాక్ స్పాట్లు, 62 ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రదేశాలను

గుర్తించినట్లు వెల్లడించారు. ఈ ప్రాంతాల్లో సంబంధిత శాఖల అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టి, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు అమలు చేయాలని సూచించారు. అవసరమైన చోట ట్రాఫిక్ సిగ్నల్స్, అనుమతులు, ఇతర సాంకేతిక చర్యలు వేగంగా చేపట్టాలని అన్నారు.ఈ సమావేశంలో ఆర్ అండ్ బి డిఈ నాగేశ్వరరావు సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఒట్టేసి చెప్పు తల్లి ఓటు కారు గుర్తుకే వేస్తావని

## మాజీ మంత్రి ఎర్రబెల్లి



**(తొలివార్త) 05 మహబూబాబాద్ జిల్లా :** పాలకుర్తి నియోజకవర్గం,తొర్రూర్ మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో బిఆర్ఎస్ అభ్యర్థులతో కలిసి గడప గడపకు వెళ్లి జోరుగా ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు.బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కొరకై ప్రతీ గడప గడపకు ప్రచారం నిర్వహించి ఓటర్ మహాశయులను ఓటును అభ్యర్థించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు.ఈ సందర్భంగా ఓ మహిళ దగ్గరకు వెళ్ళి ఆ మహిళ చేతిలో చెయ్యేసి 'ఒట్టేసి చెప్పు తల్లి కారు గుర్తుకే ఓటేయ్యాలి..' అని ఓటును అభ్యర్థించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి. ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లితో తొర్రూరు మునిసిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ నాయకులు,యువజన నాయకులు,కార్యకర్తలు,వార్డులవారిగా ఓటర్లు,యూత్ సోషల్ మీడియా నాయకులు పాల్గొన్నారు.

# సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ ను సన్మానించిన సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ సేన నాయకులు



**జనగామ జిల్లా దేవరుప్పుల మండలం (తొలివార్త) 05 :** సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ సేన జాతీయ అధ్యక్షుడు పంజాల జైహింద్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన (సర్పంచ్)పెద్ది కృష్ణమూర్తి గౌడ కు శాలువతో ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని రవీంద్ర భారతిలో ఘనంగా సన్మానించి షీల్డును అందజేసి శుభాకాంక్షలు తెలిపిన సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ సేన సంఘం నాయకులు.లిఇట్టి కార్యక్రమాని నిర్వహించిన్న గౌడ సంఘ నాయకులకు దేవరుప్పుల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో సుప్రజ హాస్పిటల్ ఎండి డాక్టర్ శివ,విజయ్ గౌడ్,ఘనగాని మల్లేష్ గౌడ్,బత్తిని రాజు గౌడ్,జాజుల శ్రీనివాస్ గౌడ్,నూతి శ్రీకాంత్ గౌడ్,చెరుకు సుధాకర్ గౌడ్,రేఖ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి అర్థిక సహాయం అందజేత ఏ జేఆర్



**వలిగొండ ఫిబ్రవరి 5(తొలి వార్త) :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పహిల్వాన్ పూర్ గ్రామానికి చెందిన దుబ్బ సుక్కమ్మ గారు అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు , వారి యొక్కకుటుంబ సభ్యులకి (ఏజేఆర్ ఫౌండేషన్) ఎలిమినేటి జంగారెడ్డి సహకారంతో (5000 వేల రూపాయలు ) అందజేశారు.. గ్రామ ప్రముఖులు గ్రామ యువత పాల్గొన్నారు.

# ఈవీఎం గోడౌన్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్





**భద్రాద్రి జిల్లా ఫిబ్రవరి 5 (తొలి వార్త) :** గురువారం నాడు ఆర్డీవో కార్యాలయం ప్రాంగణంలో ఈవీఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈవీఎం భద్రతకు సంబంధించి ప్రతినెల తనిఖీ చేయడం జరుగుతుందని, ఇందులో భాగంగా గురువారం సందర్శించడం జరిగిందని తెలిపారు. ఈ పరిశీలనలో భాగంగా సీసీ కెమెరా గదిలో కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం ఆయన గోడౌన్ పరిసర ప్రాంతంలో పరిశుభ్రంగా ఉంచాలని, అనుమతి లేనిదే ఎవరిని లోపలికి అనుమతించరాదని అధికారులకు సెక్యూరిటీ గార్డ్ కు తెలిపారు. అనంతరం తనిఖీ రిజిస్టర్లు సంతకం చేశారు.ఈ తనిఖీలో కలెక్టర్ వెంట ఎన్నికల సూపరింటెంట్ రంగ ప్రసాద్, ఎన్నికల సిబ్బంది నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శివ స్వాములకు అన్నప్రసాదం (బిక్ష) నాతి బిక్షపతి



**ఆత్మకూర్ (యం)/ తొలి వార్త/ ఫిబ్రవరి 5 :** ఆత్మకూర్ మండల కేంద్రంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శివదీక్ష చేస్తున్న స్వాములకు ఈరోజు రాయిపల్లి గ్రామ వాస్తవ్యులు భారతీయ జనతా పార్టీ మండల నాయకులు నాతి బిక్షపతి గౌడ్ వాణి దంపతులు శివ దీక్ష చేస్తున్న స్వాములకు(బిక్ష) ఏర్పాటు చేయడం జరిగింది . ఈ సందర్భంగా వారికి,వారి కుటుంబ సభ్యులకు ఆ పరమేశ్వరుడు అష్టఐశ్వర్యాలు ఆయురారోగ్యాలు కలిగించాలని శివ స్వాములు ఆశీర్వదించారు కార్యక్రమంలో బెజ్జరబోయిన సాయి మరియు గురుశివస్వామి అయోధ్య, శివ స్వాములు నరసింహ, సోమేశ్,నర్సిరెడ్డి,శ్రీశైలం, భాగ్యలక్ష్మి ,శ్యామ్, విజయ్, ఉపేందర్, వెంకటేష్, యాదగిరి నర్సయ్య, ప్రసాద్,సంతోష్, సందీప్,పురుషోత్తం,దామోదర్ సాయి, రాజు, మల్లేష్, విప్లవ్,రవి,సురేష్,భక్తులు తదితరులు స్వాములు పాల్గొన్నారు.

# ధండమూడి ఎన్‌క్లేవ్ కాలనీ దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాల దైవసేవలో పాల్గొన్న బి.ఆర్.ఎస్.ఎల్. పి. విప్పు ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్



**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం,ఫిబ్రవరి 5 తొలి వార్త ప్రతి నిధి :** జీడిమెట్ల ధండమూడి ఎన్‌క్లేవ్ కాలనీలోని శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించిన 4వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగిన అభరణాలు, పట్టువస్త్రాల ఊరేగింపు కార్యక్రమంలో బి.ఆర్.ఎస్.ఎల్. పి. విప్పు ఎమ్మెల్యే శ్రీ కె.పి. వివేకానంద్ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన సంస్కృతి, సాంప్రదాయాలు కాపాడుకోవడంలో ఆధ్యాత్మిక కార్యక్రమాల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు పెద్ది సురేష్, ప్రధాన కార్యదర్శి కుమార్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు పుప్పాల భాస్కర్, చీరాల రమేష్ మరియు ఇతర సభ్యులు. కాలనీ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి - సర్పంచ్ మల్లికార్జున్



**నూతనకల్..ఫిబ్రవరి 5 (తొలి వార్త) :** గ్రామంలో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించినట్లు నూతనకల్ సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ప్రధాన వీధులలో గ్రామపంచాయతీ సిబ్బంది పారిశుధ్య కార్మికులతో కలిసి డ్రైనేజీ లోని చెత్తను స్వయంగా తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచి గ్రామంలో వ్యాధులు ప్రబలకుండా చూస్తానని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ కార్యదర్శి రాగి చలమయ్య కారోబార్ నకిరేకంటి శంభయ్య గ్రామపంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య కార్మికులు తదితరులున్నారు.

# జనగామ మున్సిపాలిటీ ఎన్నికల కాంగ్రెస్ ప్రచారంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**జనగామ జిల్లా ఫిబ్రవరి 5 (తొలి వార్త) :** తెలంగాణ స్టేట్ (తొలి వార్త) బ్యూరో (మీసాల ఉదయ భాస్కర్) జనగామ మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎన్నికల ప్రచార కార్యక్రమంలో, జనగామ అబ్జర్వర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ప్రజల మధ్యకు వెళ్లి 5, 6, 7, 8, 9 మరియు 10వ వార్డుల్లో విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజల జీవన స్థాయిని మెరుగుపరచే అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. స్థానికులు తెలియజేసిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రచారంలో భాగంగా ,ఎమ్మెల్యే చాయ్ దుకాణంలో చాయ్ అమ్ముతూ, కూరగాయల దుకాణంలో కూరగాయలు అమ్ముతూ సామాన్య ప్రజలతో మరింత సన్నిహితంగా మమేకమయ్యారు. ప్రజల జీవన విధానాన్ని ప్రత్యక్షంగా అనుభవిస్తూ వారి కష్టసుఖాలను నేరుగా తెలుసుకున్న ఈ వినూత్న ప్రచారం ప్రజల నుంచి విశేష ఆదరణ పొందింది. దీంతో కాంగ్రెస్ పార్టీ ప్రచారం మరింత బలోపేతమైంది. ప్రజల నుంచి ఎమ్మెల్యే ఆత్మీయ స్పందన లభించగా, తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, పారిశుధ్యం, ఉపాధి అవకాశాలు వంటి అంశాలపై ప్రజలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. వీటిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ప్రతి సమస్యను ప్రాధాన్యతతో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,ప్రజల విశ్వాసమే కాంగ్రెస్ పార్టీకి అసలైన బలం. ప్రజా సంక్షేమమే మా పాలనకు మార్గదర్శకం"అని పేర్కొన్నారు. అనంతరం జనగామ మున్సిపాలిటీ పరిధిలోని 6వ మరియు 7వ వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలను పినపాక శాసనసభ్యులు, పాయం వెంకటేశ్వర్లు, లాంఛనంగా ప్రారంభించారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమఅభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి ఖదీర్,కుర్రం రవి బండారు సాంబశివ రావు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.

# ప్రజల శ్రేయస్సే మాకు ముఖ్యం... గ్రామ అభివృద్ధి మా లక్ష్యం

## చింతిర్యాల,సర్పంచ్ ఎనిక ఉషారాణి

**భద్రాద్రి జిల్లా ఫిబ్రవరి 5 (తొలి వార్త) :** అశ్వాపురం మండల పరిధిలోని చింతిర్యాల గ్రామపంచాయతీ సర్పంచ్ గా ఎన్నికైన అతికొద్ది రోజులలోనే పంచాయితీలోని మూడు గ్రామాల ప్రజలకు ఎన్నో మెరుగైన సేవలు అందిస్తూ గ్రామ అభివృద్ధిలో ముందుంటూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధి కొరకు శ్రమిస్తున్న సర్పంచ్ ఎనిక ఉషారాణి, ప్రత్యర్థుల సైతం మన్నలు పొందుతు అభివృద్ధి పదం లో దుసుకుపోతున్న సర్పంచ్, ఉప సర్పంచ్, లు ఈ సందర్భంగా చింతిర్యాల సర్పంచ్ ఎనిక ఉషారాణి, మాట్లాడుతూ, నన్ను ఓట్లు వేసి గెలిపించిన ప్రజల శ్రేయస్సే మాకు ముఖ్యం.. గ్రామ అభివృద్ధి మా లక్ష్యం... అని ఆమె అన్నారు. అనంతరం గెలుపొందిన,కాడినుండి మొదలుకొని సర్పంచ్ ఎనిక ఉషారాణి మరియు ఉప సర్పంచ్ యక్కటి. పున్నారెడ్డి వారు




ఇరువురు గత కొన్ని రోజులు గా చింతిర్యాల మెయిన్ రోడ్డు మరమ్మతులు చేపించి పంచాయితీలో పరిధిలోని కట్టాంవారిగూడెం, మంగళచెలక, చింతిర్యాల గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంప, చెట్లను, చెత్తను తొలగిస్తూ, గ్రామాలను శుభ్రపరుస్తూ ట్రాక్టర్ డోజర్, తో లెవెల్ చేస్తూ జెసిబి యంత్రంతో రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చారు. చింతిర్యాల పంచాయతీలో పరిశుభ్రతకు పెద్దపేట వేస్తూ గ్రామల ప్రజలకు సౌకర్యవంతంగా అభివృద్దే ప్రధాన ధ్యేయంగా పనులను పర్యవేక్షిస్తూ ప్రజల ఆదరణ అభిమానాలను పొందుతున్నారు. ఈ సందర్భంగా గ్రామాలలోని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ యక్కటి పున్నరెడ్డి, గొల్లగూడెం మాజీ ఎంపీటీసీ ఎనిక రవి బాబు ఇందిరమ్మ ఇండ్ల కమిటీ మెంబెర్ సంతపురి సతీష్ కుమార్, పంచాయితీ సెక్రటరీ రమేష్, పంచాయితీ సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సంపూర్ణత అభియాన్ 2.0 లక్ష్యాలను సమష్టిగా సాధిద్దాం !

## జిల్లా కలెక్టర్, జితేష్ వి. పాటిల్

**భద్రాద్రి జిల్లా ఫిబ్రవరి 5 (తొలి వార్త) :** నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో అమలవుతున్న సంపూర్ణత అభియాన్ 2.0 లక్ష్యాలను జిల్లా స్థాయిలోను, గుండాల మండలంలోను సమన్వయంతో సాధిద్దామని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ జిల్లా, ఆస్పిరేషనల్ మండలం (ఆకాంక్షిత మండలం) కార్యక్రమంలో భాగంగా గురువారం గుండాల మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో నిర్వహించిన సంపూర్ణత అభియాన్ 2.0 కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముందుగా గుండాల గ్రామ కూడలి నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. సంపూర్ణత అభియాన్ 2.0 క్యాంపెయిన్‌ను ప్రారంభిస్తూ జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ క్యాంపెయిన్ జనవరి 28 నుంచి ఏప్రిల్ 14 వరకు నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాబోయే రోజుల్లో జిల్లా వ్యాప్తంగా అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో త్రాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. ప్రతి నెలా అంగన్వాడీ కేంద్రాల్లో నమోదు అయిన పిల్లల ఎత్తు, బరువు కచ్చితంగా కొలిచి నమోదు చేయాలని, పిల్లలను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అంగన్వాడీ కేంద్రాల్లో నమోదు అయిన 6 నెలల నుంచి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ బాలామృతం మరియు ఇతర పోషక ఆహారాన్ని తప్పనిసరిగా అందించాలని సూచించారు.గుండాల మండలంలోని గ్రామ సర్పంచులు తమ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి, పిల్లలకు అవసరమైన పోషకాహారం అందేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆశ మరియు ఏఎన్ఎంలు వ్యాధి నిర్ధారణ పరీక్షల ద్వారా క్షయ (టీబీ) బాధితులను గుర్తించి, వారికి అవసరమైన చికిత్స అందించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు.జిల్లా పశు వైద్య అధికారులు అన్ని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయాలని ఆదేశించారు. అదే విధంగా గుండాల మండలంలో ఉన్న పశువుల సంఖ్య ఆధారంగా అవసరమైన పశుగ్రాసాన్ని రైతులు సాగు చేయాలని సూచించారు. దీనివల్ల పశువులకు సరిపడా మేత లభిస్తుందని తెలిపారు.ఈ సందర్భంగా సంపూర్ణత అభియాన్ 2.0 పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించి కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు.సంపూర్ణత అభియాన్‌లో జిల్లాను, గుండాల మండలాన్ని ప్రథమ స్థానంలో నిలపడానికి అధికారులు సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు. క్షేత్రస్థాయిలో ఉద్యోగులు,




అంగన్వాడీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పని చేసి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో హెల్త్ మరియు న్యూట్రిషన్, విద్య, పశు వైద్య శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించి తగిన సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి నాగలక్ష్మి, సిపిఓ సంజీవ రావు, మహిళా శిశు సంక్షేమ శాఖాధికారి లెనినా స్వర్ణలత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ తుకారాం నాయక్, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి వెంకటేశ్వర్లు, గుండాల మండలం ఎంపీడీవో బాలరాజు, ఆస్పిరేషనల్ బ్లాక్ ఫెలో నవనీత్, అంగన్వాడీ టీచర్లు, కార్యకర్తలు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో సరైన అభ్యర్థులను ఎన్నుకోవాలి

## డబ్బు, మద్యం, అసాధ్య హామీలకు మోసపోవద్దు: సీపీఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ

**యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 05 (తొలి వార్త ) జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లాలో త్వరలో జరగనున్న ఆరు మున్సిపాలిటీల ఎన్నికల్లో ఓటర్లు ఆచితూచి నిర్ణయం తీసుకొని సరైన అభ్యర్థులను ఎన్నుకోవాలని సీపీఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. డబ్బు, మద్యం, ఆకర్షణీయమైన కానీ ఆచరణ సాధ్యం కాని హామీలకు ప్రజలు భ్రమకు గురికావద్దని పిలుపునిచ్చింది.శుక్రవారం ఆలేరులో సీపీఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్. జనార్ధన్, డివిజన్ కార్యదర్శి ఇక్కిరి సహదేవ్, పార్టీ జిల్లా నాయకులు బేజాడి కుమార్, పోచంపల్లి పట్టణ కార్యదర్శి పగడాల శివ, చౌటుప్పల్ ప్రాంత నాయకుడు కొర్ర సర్వన్ పత్రికలకు ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పాలక వర్గ పార్టీలు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు గెలుపే లక్ష్యంగా



ప్రజలను అనేక ఆశలు, ప్రలోభాలకు గురి చేస్తూ విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేస్తున్నాయని ఆరోపించారు. అడ్డదారులు, అక్రమ పద్ధతుల ద్వారా గెలవాలని ప్రయత్నించే ఇలాంటి పార్టీల అభ్యర్థులను ఓటర్లు చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు.బీజేపీకి మతం తప్ప మానవత్వం, ప్రజల ఎజెండా లేదని విమర్శించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు మతం, మూఢనమ్మకాలు, భక్తి భావాలను ప్రచారం చేస్తోందని, 12 ఏళ్ల పాలనే దానికి నిదర్శనమని అన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా 2023 ఎన్నికల్లో ఇచ్చిన ప్రధాన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజాధనాన్ని ప్రాజెక్టుల పేరుతో కేసీఆర్ కుటుంబం, కొంతమంది మంత్రులు కమీషన్ల రూపంలో దోచుకున్నారని, అనేక అవినీతి కుంభకోణాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రజల కోసం నిజాయితీగా పనిచేసే, అవినీతి లేని, నేరచరిత్ర రహితమైన, సామాజిక బాధ్యత కలిగిన ప్రజాస్వామిక వాదులను కౌన్సిలర్లు, చైర్మెన్లుగా ఎన్నుకోవాలని వారు కోరారు.

# అలియాబాద్ మున్సిపాలిటీలో ఇంటింటి ప్రచారం లో కాంగ్రెస్ నాయకులు



**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, ఫిబ్రవరి 5,తొలి వార్త ప్రతి నిధి :** మేడ్చల్ నియోజకవర్గ పరిధిలోని అలియాబాద్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన 1వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థి ధరావత్తి రమేష్ నాయక్ ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగుతోంది.ఈ ప్రచార కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీల్లో వేగవంతమైన అభివృద్ధి జరగాలంటే అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలవాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే ఎనిమిదేళ్ల పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలో కొనసాగనుందని, అందువల్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే అభివృద్ధి పనులు త్వరత్వరగా జరుగుతాయని తెలిపారు.అలియాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.100 కోట్ల నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారని చెప్పారు. ఆ నిధులతో డ్రైనేజీ వ్యవస్థ, రహదారి అభివృద్ధి వంటి మౌలిక వసతులను మెరుగుపరుస్తామని పేర్కొన్నారు. అలాగే ఆసరా పెన్షన్లు 4000 రూపాయలు పెంచుతామణి, ఇళ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో అలియాబాద్ మున్సిపాలిటీ సర్వాంగీణ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు.

RNI : TGTEL/25/A0357
ప్రజా గళం మా కలం.....
www.tolivartha.com
తెలుగు దిన పత్రిక
www.epaper.tolivartha.com

# 20వ వార్డులో బిఆర్ఎస్ పార్టీ ఇంటింటి ప్రచారం

**బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఎండి.అతహర్ పాషా గెలుపుకై ముమ్మర ప్రచారం**




**చౌటుప్పల్ ,ఫిబ్రవరి 05 (తొలివార్త) :** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా 20వ వార్డులో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి అత్తహర్ పాషా ను గెలిపించాలని కోరుతూ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు,చౌటుప్పల్ మున్సిపల్ ఎన్నికల ఇన్చార్జి,చింతల వెంకటేశ్వర్ రెడ్డి గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా చింతల వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు రాష్ట్ర ప్రజలకు అందిస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల అమలను తుంగలో తొక్కిందని అన్నారు.మళ్ళీ ఆ పార్టీకి ఓటు వేయొద్దని,రేపు జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులని గెలిపించాలని కోరారు.తర్వాత రాష్ట్రంలో వచ్చేది ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం అని అన్నారు.20వ వార్డులో సిపిఎం పార్టీ బలపరిచిన బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఎండి.అత్తహర్ పాషాను అధిక మెజారిటీతో గెలిపించాలని వార్డు ప్రజలను కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు గిర్కటి నిరంజన్ గౌడ్,చౌటుప్పల పట్టణ అధ్యక్షులు బొమ్మిరెడ్డి వెంకటరెడ్డి,పెద్దింటి బుచ్చిరెడ్డి,మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు సుర్వి మల్లేష్ గౌడ్,మాజీ కౌన్సిలర్ గోపనగోని లక్ష్మణ్ గౌడ్,ఎండి ఖయ్యూం, ఎండి అమేర్, రాము,మునీర్,జమాల్,ముసిర్, సాయి,తదితర బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులను తనిఖీ చేసిన ఎంపీడీవో



**నూతనకల్..ఫిబ్రవరి 5 (తొలి వార్త) :** మండల కేంద్రంలో జరుగుతున్న జాతీయ ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీవో సునీత గురువారం ఆకస్మి కంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులను పరిశీలించి హాజరు పట్టికను తనిఖీ చేశారు. కూలీలు రోజుకు రూ.307 వేతనం వచ్చేలా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్రీరాములు ఈసీ లక్ష్మయ్య ఫీల్డ్ అసిస్టెంట్ గుండాల లింగయ్య యాదవ్ ఉపాధి కూలీలు రైతులు తదితరులున్నారు.

# ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి



**చెన్నూర్, ఫిబ్రవరి 05. (తొలివార్త న్యూస్) :** సిఐటియు ఆధ్వర్యంలో సీడీపీఓ చెన్నూర్ ఆఫీసు సిబ్బందికి సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా బోడంకి చందు సిఐటియు నాయకులు హాజరై మాట్లాడుతూ.. 29 కార్మిక చట్టల స్థానంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 2026 ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెలో తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు పాల్గొంటుందని తెలియజేస్తూ, విద్యుత్ సవరణ చట్టం ఉపసంహరించుకోవాలి. పేదలకు పనికి గ్యారెంటీ కల్పిస్తున్న వీ+బీ=జు+ూా చట్టాన్ని కొనసాగించాలని, తదితర డిమాండ్ల పరిష్కారానికై జాతీయ కార్మిక సంఘాలు ఒక్కరోజు దేశవ్యాప్త సమస్య సార్వత్రిక సమ్మెలో తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు పాల్గొని ఐసిడిఎస్ ను రక్షించాలని అందరూ టీచర్స్ అండ్ హెల్పర్స్ ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కార్మిక ప్రజా రైతు వ్యతిరేక ప్రమాదకర విధానాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, 2026 ఫిబ్రవరి 12న అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ సిఐటియు ఈ సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ప్రవీణ, పోతుల సరిత, శ్యామల ఉమారాణి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రచారంలో బిఆర్ఎస్ పార్టీ జోరు

**గెలుపు దిశగా రాదండి మురళి**



**చెన్నూర్, ఫిబ్రవరి 05. (తొలివార్త న్యూస్) :** చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో బిఆర్ఎస్ పార్టీ రాదండి మురళికి వెంట్టమేమున్నాము అంటూ బ్రమ్మరతం పలికారు, మాజీ ఏమ్మెల్యే బాల్క సుమన్ ఆశీర్వాదంతో గెలిచి, ప్రజా సమస్యలపై రాజీ లేని పోరాటానికి సిద్ధమని, పేద ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంట్టూ ముందుండి పని చేస్తానన్నారు,వార్డు అభివృద్ధి రాజకీయాలకు తాను ప్రతినిధినని, ప్రజా విశ్వాసమే తన అసలైన బలమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు నన్ను ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపిస్తే, 4వ వార్డును అభివృద్ధి దారిలో నిలబెడతానని ప్రజా సమస్యలపైనే నా పోరాటం అన్నారు, అదేవిధంగా, ఆశయాలను ఆదర్శంగా తీసుకొని, పేద ప్రజలకు ఎనలేని సేవ చేయడమే తన లక్ష్యమని అన్నారు, అదే విధంగ్గా సేవకుడిలా, ప్రజలకు అన్ని విధాలా లబ్ధి చేకూర్చేందుకు కృషి చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు. 4వ వార్డు ప్రజలు బిఆర్ఎస్ అయినా రాదండి మురళి కె కారు గుర్తు కి ఓటు వేసి గెలిపిస్తాం అని భరోసా ఇస్తున్నారు, అని అన్నారు.

# పాలకురాలిగా కాకుండా.. సేవకురాలిగా మీ ముందుకు వస్తున్నా...!ఆశీర్వదించి గెలిపించండి,అభివృద్ధి చేసి చూపిస్తా..!!

**18వ వార్డు మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి**

**గూగులోతు అరుణ-శంకర్**




**చౌటుప్పల్, ఫిబ్రవరి 05 (తొలివార్త) :** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా గురువారం 18వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి గూగులోతు అరుణ-శంకర్ ఇంటింటికి తిరిగి తమకు కేటాయించిన చెయ్యి గుర్తు మీద ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని వార్డు ప్రజలను కోరారు.రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి పనులు సంక్షేమ పథకాలు సాధ్యమని అన్నారు.మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో చౌటుప్పల్ మున్సిపాలిటీ లోనే 18 వార్డును అత్యధికంగా అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని తెలిపారు.నేను నాయకురాలుగా కాకుండా మీకు సేవకురాలుగా పనిచేయడానికి వచ్చానని,ప్రజలు ఆశీర్వదించి నన్ను అధిక మెజారిటీతో గెలిపించి 18వ వార్డు అభివృద్ధికి సహకరించాలని కోరారు.ఈ ఈ ప్రచార కార్యక్రమంలో 18 వ వార్డు ఇంచార్జి చిమిర్యాల మాజీ సర్పంచ్,దోనూరు జైపాల్ రెడ్డి,కాసోజు గోవర్ధన చారి,గుర్రం వెంకటేశం,వరుసు రాజు,మాజీ కౌన్సిలర్ కామిశెట్టి శైలజ భాస్కర్ గుప్తా,లింగాచారి,సోను,మరియు మహిళలు,వార్డు ప్రజలు,యువతీ యువకులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో ఇంటింటి ప్రచారం ఎమ్మెల్యే కుంభం




**వలిగొండ ఫిబ్రవరి 5 (తొలి వార్త) :** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి భువనగిరి మున్సిపల్ 35,17,34వ వార్డులలో ఇంటింటి ప్రచారంలో పాల్గొని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిలు తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్, రాచమల్ల రమేష్, సరగడ రాజ్యలక్ష్మి అమర్ గార్లని గెలిపించాలని కోరారు.

# న్యాయవాది స్వప్న హత్యకు నిరసనగా కోర్టు విధుల ధర్నా,విధుల బహిష్కరణ

**చౌటుప్పల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు బాల్యం వెంకటాచలం**




**చౌటుప్పల్, ఫిబ్రవరి 05 (తొలివార్త) :** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల కోర్ట్ నందు ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాది స్వప్న హత్యకు నిరసనగా గురువారం చౌటుప్పల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు బాల్యం వెంకటాచలం ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి,ధర్నా నిర్వహి ంచారు.ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు బాల్యం వెంకటాచలం మాట్లాడుతూ.. ఈ దేశంలో న్యాయాన్ని రక్షించే న్యాయవాదులకే రక్షణ లేకుండా పోతుందని,ఆస్తి గొడవలలో న్యాయవాది స్వప్నను హత్య చేసిన దుండగులకు కఠిన శిక్షలు విధించాలని కోరారు.ఈ హత్యను న్యాయవాదులందరూ తీవ్రంగా ఖండించారు.ఇప్పటికైనా భారత ప్రభుత్వం వెంటనే అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తేవాలని పిలుపునిచ్చారు.అదే విధంగా మరి ఎక్కడ న్యాయవాదుల పైన ఎలాంటి దాడి జరిగిన నిందితులని కఠినంగా శిక్షించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాదులు ఉడుగు శ్రీనివాస్,ఎలమోని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పడమటి మహిపాల్,జెల్ల రమేష్,శ్రీశైలం,జంగయ్య తడక మోహన్,పాల పరమేష్,సుర్వి విజయ్,భరత్ చంద్ర,మల్లికార్జున,శ్రీశైలం,శ్రీకాంత్,తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

# సీఎం కప్ కబడ్డీలో మెరిసిన శాలిగౌరారం బాలికల టీమ్

**నకిరేకల్ నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన శాలిగౌరారం బాలికల జట్టు**




**తొలి వార్త ఫిబ్రవరి 5,శాలిగౌరారం :** నకిరేకల్ లోని నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన సీఎం కప్ సీనియర్ కబడ్డీ బాలికల విభాగంలో శాలిగౌరారం మండలం ప్రథమ స్థానం సాధించినట్టు శాలిగౌరారం ఎంఈఓ మందుల సైదులు ఒక ప్రకటన లో తెలిపారు.గురువారం నకిరేకల్ మినీ స్టేడియం లో జరిగిన ఫైనల్ మ్యాచ్ లో కట్టంగూర్ బాలికల జట్టును భారీ తేడాతో ఓడించి ప్రథమ స్థానం సాధించింది.దీంతో జిల్లా స్థాయిలో నిర్వహించే సీఎం నకిరేకల్ నియోజకవర్గ టీమ్ గా శాలిగౌరారం బాలికల జట్టు ఎంపికయింది.ఈ సందర్భంగా ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులను,పీ.డి మల్లేష్ ను ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణమోహన్ ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ చెవుగోని రజిత, మున్సిపల్ కమిషనర్,నకిరేకల్ ఎంపీడీవో,నకిరేకల్ శాలిగౌరారం ఎంఈఓ లు నాగయ్య,సైదులు,గాజుల సుకన్య,పీ.డిలు పుల్లయ్య,మల్లేష్,జ్యోతి,మైబు, పి.ఈ.టీ లు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ బిఎల్ఓ లను సన్మానించిన తహసిల్దార్ వరప్రసాద్




**తొలి వార్త ఫిబ్రవరి 5,శాలిగౌరారం :** నకిరేకల్ సబ్ డివిజన్ పరిధిలోని (తుంగతుర్తి నియోజకవర్గం) శాలిగౌరారం మండలం లో బిఎల్వోలు ఓటర్ల మ్యాపింగ్ 80 శాతం పూర్తి చేశారు.మండల పరిధిలోని 40686 ఓట్లకు గాను 32549 మంది ఓటర్ల మ్యాపింగ్ ను పూర్తి చేశారు.ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియలో ఉత్తమ సేవలందించిన బూత్ లెవెల్ అధికారులను తహసిల్దార్ వరప్రసాద్ ఘనంగా సత్కరించి,బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్ ఐ లు అజారుద్దీన్,రఫీ కార్యాలయ సిబ్బంది రాంబాబు,వెంకన్న,పద్మ తదితరులు పాల్గొన్నారు.

# యడవల్లి అంగన్వాడి కేంద్రంలో అక్షరాభ్యాసం



**నూతనకల్.. ఫిబ్రవరి05 (తొలి వార్త) :** మండల పరిధిలోని యడవల్లి గ్రామంలో అంగన్వాడి కేంద్రాలలోని పిల్లలకు గురువారం సర్పంచ్ జటంగి సరిత కృష్ణ ఆధ్వర్యంలో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చిన్నారులకు పౌష్టికమైన ఆహారాన్ని అందించడంతోపాటు సరియైన విద్యను నేర్పించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దిండిగాల భూలక్ష్మి, వార్డు సభ్యులు,అంగన్వాడీ టీచర్స్ లక్ష్మి,లలిత,ఆశా వర్కర్లు, చిన్నారులు,తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# లచ్చపేటలో 'సింహం' గర్జన: స్వతంత్ర అభ్యర్థిగా బడుగు రాజు ముమ్మర ప్రచారం





**దుబ్బాక ఫిబ్రవరి 5 ( తొలివార్త) :** వార్డు అభివృద్ధి నా లక్ష్యం ప్రజా క్షేత్రంలో సింహం గుర్తుతో బడుగు రాజు మార్పు కోసం వస్తున్నా ఆశీర్వదించండి లచ్చపేట ఓటర్లకు బడుగు రాజు విజ్ఞప్తి దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు (లచ్చపేట) ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఈ వార్డు నుండి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన బడుగు రాజు తన ప్రచారంతో ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆయనకు 'సింహం' గుర్తును కేటాయించడంతో, ఆ గుర్తుతో ఆయన ఇంటింటి ప్రచారాన్ని వేగవంతం చేశారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల 2026 షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో, బడుగు రాజు వార్డులోని ప్రతి గల్లీని చుట్టేస్తూ ప్రజా సమస్యలను తెలుసుకుంటున్నారు.వార్డు అభివృద్ధికి సంబంధించి ఆయన ఇస్తున్న హామీలు స్థానికుల్లో చర్చనీయాంశంగా మారాయి. మురుగునీటి కాలువల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, మరియు నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇస్తున్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తినని, తనను 'సింహం' గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరుతున్నారు.

# అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

**వలిగొండ ఫిబ్రవరి 5 (తొలి వార్త) :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం తేదీ 05.02.2026న సుమారు 15:00 గంటలకు, విశ్వసనీయ సమాచారం అందిన మీదట, పోలీస్ సబ్-ఇన్స్పెక్టర్ తన సిబ్బందితో కలిసి వేములకొండ గ్రామం వెలుపలికి వెళ్లి, మూసీ నది నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నంబర్ ప్లేట్లు లేని ఒక ఇసుక లోడు ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. డ్రైవర్‌గా గుర్తించబడిన అరుపుల సురేష్, తండ్రి యాదయ్య, వయస్సు: 28 సంవత్సరాలు, కులం: యాదవ్, వృత్తి: డ్రైవర్, నివాసం: వేములకొండ గ్రామం, అనుమతి లేకుండా ఇసుకను దొంగిలించి అక్రమంగా రవాణా చేసినట్లు ఒప్పుకున్నాడు. ఇసుక లోడుతో ఉన్న ట్రాక్టర్ మరియు ట్రాలీని పంచనామా చేసి స్వాధీనం చేసుకుని, నిందితుడిని మరియు స్వాధీనం చేసుకున్న ఆస్తిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. క్రైమ్ నెం. 24/2026 కింద సెక్షన్ 303(2), 223 దీమీ మరియు సెక్షన్ 21(1) ఎం ఎం ఎం డిఆర్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# కొలనుపాక లో సీఎం కప్ క్రీడోత్సవాలు

**క్రీడాకారుల ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి**





**యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 05 (తొలి వార్త) జిల్లా ప్రతినిధి :** ఆలేరు:సీఎం కప్ రెండో ఎడిషన్‌లో భాగంగా ఆలేరు నియోజకవర్గ స్థాయి క్రీడోత్సవాలు ఆలేరు మండలం కొలనుపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆకుల వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన యాదాద్రి భువనగిరి జిల్లా విద్యాశాఖ అధికారి కందుల సత్యనారాయణ మాట్లాడుతూ, క్రీడాకారులు ప్రతిరోజూ క్రమం తప్పకుండా సాధన చేస్తూ జాతీయస్థాయి క్రీడాకారులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. యువత మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండి, క్రీడలను వృత్తిగా ఎంచుకొని క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు.ఈ క్రీడోత్సవాల్లో నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలు, రెండు మున్సిపాలిటీలకు చెందిన దాదాపు 650 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బెదరబోయిన కనకమ్మ, మండల విద్యాధికారి ఎర్ర లక్ష్మి, నియోజకవర్గంలోని వ్యాయామ ఉపాధ్యాయులు మధు, తదితరులు పాల్గొన్నారు.

# గుండాల మండలంలో పెద్దపులి సంచారం

**ప్రజలు జాగ్రత్తగా ఉండాలి , అడవి శాఖ అధికారులు ఎల్లయ్య బృందం**

**గుండాల ఎస్సై తేజం రెడ్డి , ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు**



**యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 05 (తొలివార్త) జిల్లా ప్రతినిధి :** గుండాల మండలంలోని అనంతారం వెల్మజాల గ్రామాలలో పెద్దపులి సంచరించినట్లు భువనగిరి అటవీ శాఖ అధికారులు ఎల్లయ్య బృందం అనంతరం గ్రామాల్లో పర్యటించి పులి సంచరించిన ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఈ ప్రాంతంలో పులి సంచరిస్తుంది ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు మేకలు గొర్రెలు పశువులను తమ ఇండ్ల వద్దనే ఉండే విధంగా చూసుకోవాలని అన్నారు ఈ ప్రాంతంలో పులి సంచరిస్తున్నది ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తెలియజేశారు.

# సీఎం కప్,నియోజకవర్గస్థాయి బాలుర క్రీడలలో విజేతలకు బహుమతి ప్రధానోత్సవం



**భద్రాద్రి జిల్లా ఫిబ్రవరి 5 (తొలి వార్త) :** మణుగూరు మండలం, జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రాంగణంలో జరిగిన పినపాక నియోజకవర్గ స్థాయి బాలుర "సీఎం కప్ -2025" క్రీడల పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మణుగూరు మండల తాహసిల్దార్ అద్దంకి నరేష్ ,సమితి సింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, జడ్.పి.హెచ్.ఎస్ ప్రిన్సిపాల్, ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు మరియు వారి సిబ్బంది,కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎ ఎం. చారీ, బొజ్జా త్రిమూర్తులు, ఎండి యాకూబ్ మరియు మండల అధికారులు క్రీడాకారులు, క్రీడా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# పోటీలో ఉన్న అభ్యర్థులు 48 గంటల నిబంధన తూ.చా. తప్పకుండా పాటించాలి

**జిల్లా కలెక్టర్ హనుమంతరావు**




**యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 05 (తొలివార్త) జిల్లా ప్రతినిధి :** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఈ నెల 11వ తేదీన పోలింగ్ జరగనున్న నేపథ్యంలో పోటీలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు 48 గంటల నిబంధన ఖచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత రావు ఒక ప్రకటనలో తెలిపారు.పోలింగ్ ముగిసే 48 గంటల ముందు ప్రచారాన్ని నిలిపివేయాలని, సభలు, సమావేశాలు, ర్యాలీలు, మీడియా, ప్రసార సాధనాల ద్వారా ఎలాంటి ప్రచార సంబంధిత అంశాలను కొనసాగించకూడదని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి తెలంగాణ మున్సిపాలిటీ యాక్ట్ 2019 చట్టంలోని సెక్షన్ 209 ప్రకారం శిక్ష విధించడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల సమీపంలో ఓటర్లను ప్రభావితం చేసే విధంగా ఎలాంటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించకూడదని తెలిపారు. రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థులు, మీడియా యాజమాన్యాలు 48 గంటల నిబంధనను ఖచ్చితంగా పాటించాలని, స్వేచ్ఛాయుత, పారదర్శకమైన ఎన్నికలు జరిగేందుకు అందరూ సహకరించాలని తెలిపారు.

# నారాయణపేట ఆయకట్టు అభివృద్ధి శాఖ మరియు నీటి పారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కు వినతి



**నారాయణపేట ఫిబ్రవరి 05 (తొలివార్త) :** ఆయకట్టు అభివృద్ధి శాఖ మరియు నీటి పారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బ్రహ్మానందం ను కలిసిన అవుసలోనిపల్లి భారత రాష్ట్ర సమితి నాయకులు .గ్రామంలోని గుంతచెరువు యొక్క తూములు మరియు అలుగులు, చెరువు కట్ట వెడల్పు, కాలువల నిర్మాణం మరియు చెరువుకు ఇరువైపుల ముళ్ళ పొద లు తొలగించి, పూడిక తీత మరమ్మత్తులు తదితర సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్లగా వారు సానుకూలంగా స్పందించడం జరిగింది. చెరువు యొక్క ఆయ కట్టు విస్తీర్ణం 284 ఎకరాలు సాగు అవుచున్నది.ఈ సంవత్సరం అధిక వర్షాల కారణంగా చెరువు కట్ట పూర్తిగా దెబ్బతిని పగుళ్ళు ఏర్పడి ఏక్షణానికైన తెగిపోవుటకు సిద్ధంగా ఉన్నది. తూములు మరియు అలుగ ులు మరమ్మత్తులు చేసి పూడిక తీసి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో సీనియర్ నాయకులు దాసరి తిమ్మయ్య,వెంకటేశ్వర్ రెడ్డి,శ్రీనివాస్ పాల్గొన్నారు.

# సీఎం కప్‌లో మెడిగడ్డ తండా మెరుపు,మండల స్థాయిలో ప్రథమ స్థానం కైవసం



**బాలానగర్, ఫిబ్రవరి 5 (తొలివార్త) :** బాలానగర్ మండల కేంద్రంలో అత్యంత ఉత్సాహంగా నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీల్లో మెడిగడ్డ తండా జట్టు చరిత్ర సృష్టించింది. గురువారం జరిగిన తుది పోరులో తండా క్రీడాకారులు అద్భుతమైన ప్రతిభను కనబరిచి మొదటి స్థానాన్ని సాధించారు. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోటీల్లో తండా యువత చూపిన చొరవ, క్రీడా పటిమ అందరినీ ఆకట్టుకుంది.ఈ విజయం పట్ల మెడిగడ్డ తండాలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామ సర్పంచ్ ధర్మి లాస్కర్ నాయక్, ఉప సర్పంచ్ రమేష్ నాయక్ గెలిచిన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడానికి సీఎం కప్ ఒక గొప్ప వేదిక. మా తండా యువత కష్టపడి ఆడి ఈ ఘనత సాధించడం తండాకే గర్వకారణం. ఇదే స్ఫూర్తితో జిల్లా మరియు రాష్ట్ర స్థాయిలో కూడా రాణించాలి అని పిలుపునిచ్చారు.తండా వాసులు బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకుంటూ క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. యువతకు ఈ విజయం ఒక పెద్ద ఇన్స్పిరేషన్ అని, భవిష్యత్తులో మరిన్ని మెడల్స్ సాధిస్తామని క్రీడాకారులు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తండా ప్రముఖులు, వ్యాయామ ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో రెబల్స్ బెడద

**ప్రధాన పార్టీల్లో మొదలైన టెన్షన్**

**పురపాలక ఎన్నికల్లో పార్టీలకు రెబల్స్ టెన్షన్**

**బుజ్జగింపులు ఫలించకపోవడంతో పలువురు పార్టీకి వ్యతిరేకంగా ఎన్నికల ప్రచారం**

**గెలుపోటములు తారుమారవుతాయని అభ్యర్థుల ఆందోళన**



తెలంగాణలో ఎక్కడ చూసిన పురపాలక ఎన్నికల సందడి నెలకొంది. పురపోరులో అసమ్మతి సెగలు మాత్రం ఆరడం లేదు. నామినేషన్ల ముందు నుంచి పలు పార్టీలు చేస్తున్న బుజ్జగింపులు ఫలించకపోవడంతో పలువురు పార్టీకి వ్యతిరేకంగా బరిలో నిలిచి(రెబల్స్) ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చాలా వార్డుల్లో తిరుగుబాటు అభ్యర్థులతో ఇబ్బందికర పరిస్థితి ఉంది. కొన్నిచోట్ల హెచ్చరికలు ఫలించకపోవడంతో వారిపై సస్పెన్షన్ వేటు వేశారు. అయినప్పటికీ పరిస్థితుల్లో మార్పు లేదు. వారి కారణంగా పలుచోట్ల తమ గెలుపోటములు తారుమారయ్యే అవకాశం ఉందని పార్టీల అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

**ససేమిరా అనడంతో :** టికెట్ల కేటాయింపు నుంచి మొదలైన వివాదాలు, నామినేషన్ల ఉపసంహరణ నాటికి తారాస్థాయికి చేరుకున్నాయి. పలుచోట్ల బీ-ఫాంలు చేతికందని ఆశావాహూలు తమ పార్టీ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. కొన్నిచోట్ల ఇవి తారస్థాయికి చేరి ఆత్మహత్యలు చేసుకుంటామనే స్థాయి వరకు వెళ్లింది. వివిధ సమీకరణలు, అభ్యర్థులకున్న పట్టును అంచనావేసి బీ-ఫాంలను ఇచ్చారు. టికెట్ రానివారిలో చాలామంది అప్పటికే ఎన్నికల ప్రచారంలోకి దిగడం, ఎన్నికల షెడ్యూల్ నుంచి వార్డుల్లో పర్యటిస్తూ పోటీలో ఉంటామని ప్రజలను కలవడంతో నామినేషన్ల ఉపసంహరణలకు వారు ససేమిరా అన్నారు.

**పలు ప్రాంతాల్లో ఇలా :**

కరీంనగర్ కార్పొరేషన్‌లోని 3 డివిజన్లలో బీజేపీకి తిరుగుబాటు అభ్యర్థులు ఉన్నారు. తమకు టికెట్ నిరాకరించారని వారు ప్రచారంలో ముందుకెళ్తున్నారు. కాంగ్రెస్ పార్టీలోనూ 3 డివిజన్లలో సై అంటే సై అనేలా పోరుకు సిద్ధమయ్యారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 467 డివిజన్లు, వార్డుల్లో దాదాపు 50 చోట్ల పార్టీలకు ఈ బెడద ఉంది. ఖమ్మం జిల్లాలోని వైరాలో 8 వార్డులలో 9 మంది అధికార పార్టీకి రెబెల్స్‌గా ఎన్నికల బరిలో ఉన్నారు. సత్తుపల్లిలో ఒక వార్డులో, కల్లూరులో రెండుచోట్ల భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) తిరుగుబాటు అభ్యర్థులు రంగంలో నిలిచారు. సూర్యాపేటలో కాంగ్రెస్‌లో 8 మంది, బీఆర్ఎస్‌లో 3, నల్గొండ కార్పొరేషన్‌లో మూడు పార్టీల తరఫున ఒక్కో డివిజన్‌లో ఒకరు చొప్పున తిరుగుబాటు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. తిరుమలగిరిలో కాంగ్రెస్ నుంచి నలుగురు, భారత రాష్ట్ర సమితి నుంచి ఒకరు రెబల్ అభ్యర్థులున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జగన్ పార్టీకి రిజైన్ చేశారు. కల్వకుర్తిలోని 11వ వార్డులో నామినేషన్ వేసినప్పటికీ టికెట్ దక్కలేదు. దీంతో ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని వడ్డేపల్లిలో భారత రాష్ట్ర సమితి టికెట్లు రాని 9 మంది ఏఐఎఫ్‌బీ నుంచి పోటీలో ఉన్నారు. టికెట్ రాకపోవడంతో వనపర్తి జిల్లాలోని పెబ్బేరు 3 వార్డులో మాజీ కౌన్సిలర్ సువర్ణ, ఆమె భర్త కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు వెంకట్రాములు ఇద్దరూ ఎన్నికల బరిలో ఉంటూ ప్రచారాన్ని సాగిస్తున్నారు. మెదక్ కాంగ్రెస్‌లో ముగ్గురు, బీఆర్ఎస్ ఒకరు అసమ్మతి రాగం వినిపిస్తున్నారు. సంగారెడ్డి, నారాయణఖేడ్, సదాశివపేట, జహీరాబాద్, గడ్డిపోతారం, అందోలు బల్దియాల్లో తిరుగుబాటు అభ్యర్థుల బెడద ఎక్కువగా ఉంది. మరోవైపు సంగారెడ్డిలో ముగ్గురు కాంగ్రెస్ నాయకులను సస్పెండ్ చేశారు. జహీరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీకి 15 మంది, భారత రాష్ట్ర సమితికి ఆరుగురు రెబల్ అభ్యర్థులున్నారు. ఉమ్మడి వరంగల్‌లో 260 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీకి 26 మంది రెబల్ అభ్యర్థులు ఉన్నారు. నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్‌లో కాంగ్రెస్ నుంచి ఏడుగురు తిరుగుబాటు అభ్యర్థులు బరిలో నిలిచారు. రెబల్ అభ్యర్థుల కారణంగా తమ భవితవ్యం తారుమవుతుందని ఆయా పార్టీల తరఫున పోటీ చేస్తున్న అభర్థులు వాపోతున్నారు.


# వారం రోజులుగా నిద్రపోలేదు - 3 జిల్లాల సరిహద్దు గ్రామాల్లో అంతా భయం భయం

**మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ నుంచి వచ్చిన పెద్దపులి**

**యాదాద్రి, సిద్దిపేట, జనగామ జిల్లాల సరిహద్దుల్లో సంచారం**

**ఆడపులి కోసం 375 కిలోమీటర్ల ప్రయాణం**

**థర్మల్ డ్రోన్లు ఉపయోగిస్తున్న అటవీశాఖ**



సిద్దిపేట, యాదాద్రి-భువనగిరి, జనగామ జిల్లాల సరిహద్దు గ్రామాల ప్రజలను ఓ పులి నిద్రపోనీయకుండా చేస్తోంది. వారం రోజులుగా పులి ఆనవాళ్లతో ఈ సరిహద్దు గ్రామాల ప్రజలు భయంతో హడలిపోతున్నారు. నిన్న ఏకంగా 2 ఆవులు, దూడను చంపడంతో ఈ భయం మరింత పెరిగింది. అటవీ శాఖ చెప్పిన వివరాల ప్రకారం గత రెండు వారాలుగా సిద్దిపేట, యాదాద్రి-భువనగిరి, జనగామ జిల్లాల సరిహద్దుల్లో పెద్దపులి సంచరిస్తోంది. కెమెరాల్లో రికార్డయిన చిత్రాల ఆధారంగా అది మగ పులి అని మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ టైగర్ రిజర్వు నుంచి వచ్చిందని వెల్లడించింది. ఈ పులి విషయంలో తాజా పరిణామాలను ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యూహంపై అటవీశాఖ అరణ్యభవన్‌లో బుధవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించింది.

**పీసీసీఎఫ్ సూచనలు :**

అటవీ సంరక్షణ ప్రధాన అధికారి, అటవీ దళాల అధిపతి సువర్ణ, ఉన్నతాధికారులు వినయ్‌కుమార్, క్షితిజ, వైల్డ్‌లైఫ్ ఓఎస్డీ శంకరన్ హాజరయ్యారు. ఎన్టీసీఏ (జాతీయ పులుల సంరక్షణ సంస్థ) సభ్యురాలు హరిణి వేణుగోపాల్, వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ప్రతినిధి రమేష్, హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ సభ్యుడు ఇమ్రాన్ సిద్దిఖ్, పుణేకు చెందిన రెస్క్యూ బృంద నిపుణులతో ఇటీవల ప్రత్యేక సాంకేతిక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సభ్యులు అటవీశాఖ ఉన్నతాధికారులతో బుధవారం ఆన్‌లైన్ సమావేశంలో పాల్గొన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అదే సమయంలో పులికి హాని కాకుండా ట్రాకర్లు ఏర్పాటు చేయాలని అటవీశాఖ సిబ్బందికి పీసీసీఎఫ్ సూచించారు.

**పులి కదలిక తెలుసుకునేందుకు థర్మల్ డ్రోన్లు :**

ఆడపులి తోడు కోసం తిప్పేశ్వర్ అడవుల నుంచి బయల్దేరిన ఈ పులి కవ్వాల్ టైగర్ రిజర్వుకు అక్కడ్నుంచి పలు జిల్లాల మీదుగా వచ్చి ఇప్పుడు సిద్దిపేట, యాదాద్రి-భువనగిరి, జనగామ జిల్లాల సరిహద్దుల్లో సంచరిస్తోంది. కచ్చితమైన కదలికల కోసం అటవీశాఖ కెమెరా ట్రాప్‌లు, థర్మల్ డ్రోన్లను ఉపయోగిస్తుంది. ఇస్మాయిపేట, చిన్నలక్ష్మీపురం సమీప ప్రాంతాల్లో పులి కనిపించినట్లు ట్రాకింగ్ టీంలు పేర్కొన్నాయి.

**ఈ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి :**

పులి సంచరిస్తున్న విషయం తెలియడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, రైతులు భయాందోళన చెందుతున్నారు. పులి భయంతో రాత్రిళ్లు నిద్రపట్టడం లేదని వాపోయారు. ఏ సమయంలో వచ్చి దాడి చేస్తుందేమోనని భయపడుతున్నారు. జనగామ ఎఫ్ఆర్వో కొండల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామ పరిధిలో పెద్దపులి సంచరిస్తోందని తెలిపారు. బసంతాపురం, లక్ష్మక్కపల్లి గ్రామాల్లో పాదముద్రలు కనిపించాయి. దీంతో పరిసర గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**అడవిలో సీసీ కెమెరాల ఏర్పాటు :**

పులి జాడ కోసం జనగామ, యాదాద్రి, సిద్దిపేట జిల్లాల అటవీశాఖ అధికారులు సంయుక్తంగా గాలిస్తున్నారు. రైతులు పొలాలు, అడవుల సమీపానికి గుంపులుగా మాత్రమే వెళ్లాలని సూచించారు. కొన్ని రోజుల పాటు పశువులను బయటికి తీసుకెళ్లకుండా ఇంటి వద్దనే ఉంచి పోషించుకోవాలని సూచించారు. ప్రస్తుతానికి యాదాద్రి జిల్లా కొలనుపాక-శ్రీనివాసపురం మధ్య పులి సంచరిస్తున్నట్లు భావిస్తున్నారు. దాన్ని ప్రాణాలతో బంధించేందుకు సిద్దెంకి గుట్ట వద్ద బోను, అడవిలోని పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పులి కనిపిస్తే వెంటనే తమకు తెలియజేయాలని సూచించారు. రోజూ సరిహద్దు జిల్లాలో 50 కి.మీ ప్రయాణం : యాదాద్రి జిల్లాలోని తుర్కపల్లి మండలంలోని దత్తాయిపల్లి అటవీ ప్రాంతాన్ని పులి తన స్థావరంగా మార్చుకుందని గ్రామస్థులు తెలిపారు. అక్కడి నుంచి అది రోజూ సరిహద్దు జిల్లాల్లో 50 కిలోమీటర్ల వరకు ప్రయాణించి తిరిగి అదే ప్రదేశానికి వస్తుందని సమాచారం. తుర్కపల్లి అడవుల నుంచి ఒక ఆడపులి కోసం దాదాపు 375 కిలోమీటర్ల దూరం ప్రయాణించి వచ్చిన మగ పులి ఇదేనని అటవీ శాఖ అధికారులు తెలిపారు. "లక్షల రూపాయల విలువైన రెండు ఆవులు ఒక దూడను పులి చంపింది. మేము ఆవులను కొని పాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాము. రాత్రికి రాత్రే అంతా నాశనమైపోయింది. అధికారులు ఆలస్యం చేయకుండా వెంటనే చర్యలు తీసుకుని, పులిని పట్టుకుని అడవిలోకి తరలించాలి. ప్రభుత్వం నన్ను, నా కుటుంబాన్ని ఆదుకోవాలి.

# రాష్ట్రంలో రూ.12,967 కోట్ల రైల్వే ప్రాజెక్టులు పూర్తి

**కొనసాగుతున్న కొత్తలైన్ల నిర్మాణ పనులు**

**రూ.34,680 కోట్ల రైల్వే ప్రాజెక్టుల పనుల కొనసాగింపు**

**గత నాలుగు ఏళ్లలో 15 కొత్త లైన్లు, 50 డబ్లింగ్ లైన్లకు సర్వే పనులు చేపట్టినట్లు వివరణ**



ఏపీలో ఇప్పటి వరకు రూ.12,967 కోట్ల విలువైన 10 రైల్వే ప్రాజెక్టులు పూర్తయ్యాయని, ఇప్పుడు రూ.34,680 కోట్ల విలువైన మరో 16 ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. బుధవారం లోక్‌సభలో టీడీపీ ఎంపీలు మాగుంట శ్రీనివాసులురెడ్డి, పుట్టా మహేష్‌కుమార్‌లు అడిగిన వేర్వేరు ప్రశ్నలకు ఆయన ఈ మేరకు సమాధానం ఇచ్చారు. గత 4 ఏళ్లలో 15 కొత్త లైన్లు, 50 డబ్లింగ్ లైన్ల కోసం సర్వే పనులు చేపట్టామని ఆయన వివరించారు. వీటి మొత్తం పొడవు 6,985 కిలోమీటర్లని వెల్లడించారు. 2025 ఏప్రిల్ 1 నాటికి ఏపీకి 4,499 కిలోమీటర్ల పొడవైన 12 కొత్త లైన్లు, 27 డబ్లింగ్ పనులు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. వాటి విలువ రూ.70,232 కోట్లని ఆయన వెల్లడించారు. అందులో 1,178 లైన్లు ప్రారంభం అయ్యాయని, అందుకోసం రూ.28,039 కోట్లు ఖర్చు చేసినట్లు రైల్వేమంత్రి తెలిపారు.

**మొత్తం ప్రాజెక్టుల విలువ :**

గుంటూరు డివిజన్‌లో రవాణా సౌకర్యాలను సులభతరం చేయడానికి గుంటూరు-గుంతకల్లు (401 కి.మీ.), గుంటూరు-బీబీనగర్ (239 కి.మీ.) డబ్లింగ్ పనులు, గుంటూరు యార్డ్‌కు మల్టీ ట్రాకింగ్, ఎర్రుపాలెం- అమరావతి- నంబూరు మధ్య 57 కిలో మీటర్ల పొడవైన కొత్తలైన్ల నిర్మాణ పనులు మొదలుపెట్టినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టుల మొత్తం విలువ రూ.9,353 కోట్లని తెలిపారు. ఇందులో గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్ పనులు 357 కి.మీ. మేర పూర్తయ్యాయని, మిగిలిన పనులు జరుగుతున్నాయన్నారు.

**రాష్ట్రాలు 50:50 నిష్పత్తిలో :**

అమరావతి లైన్ కోసం భూ సేకరణ ప్రక్రియ చేపట్టినట్లు వివరించారు. గుంటూరు-బీబీనగర్ డబ్లింగ్ పనులు కూడా కొనసాగుతున్నాయని అన్నారు. రూ.3,796 కోట్ల విలువైన భద్రాచలం-కొవ్వూరు (119 కి.మీ.) కొత్త లైన్ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్రాలు 50:50 నిష్పత్తిలో వ్యయాన్ని పంచుకొనే పద్ధతిలో మంజూరు చేశామని, అందులో ఇప్పటి వరకు భద్రాచలం-సత్తుపల్లి (56 కి.మీ.) మధ్య లైన్ నిర్మాణం పూర్తి అవుతుందని వివరించారు.

**ఏపీలో లక్షల టన్నుల సామర్థ్యం గల గోదాములు :**

కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వచ్చే ఆహార ధాన్యాల నిల్వల కోసం రాష్ట్రంలో ఎఫ్‌సీఐకి 14.35 లక్షల టన్నుల సామర్థ్యం గల గోదాములు ఉన్నట్లు కేంద్ర ఆహారం, ప్రజాపంపిణీ వ్యవహారాలశాఖ సహాయమంత్రి నిముబెన్ జయంతిభాయ్ బంభానియా తెలిపారు. ఇవికాకుండా ఎఫ్‌సీఐ కేంద్ర గోదాముల కార్పొరేషన్ నుంచి 39.38 లక్షల టన్నుల సామర్థ్యం గల గోదాములను అద్దెకు తీసుకొందని ఆయన వెల్లడించారు. బుధవారం లోక్‌సభలో రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానం ఇచ్చారు. ఫుడ్ కార్పొరేషన్ ఇండియా (ఎఫ్‌సీఐ)కి కాకినాడ పరిధిలో 90,132 టన్నులు, రాజమండ్రిలో 1,05,792 టన్నుల సామర్థ్యం ఉన్న గోదాములు ఉన్నట్లు వివరించారు. కేంద్ర గోదాముల కార్పొరేషన్‌కు రాజమండ్రిలో 51,895 టన్నులు, కాకినాడలో 29,943 టన్నుల నిల్వ సామర్థ్యం ఉన్న గోదాములు ఉన్నట్లు చెప్పారు.

**ఓఎఫ్‌సీ నిర్మాణం పూర్తి :**

ఏపీలో 2,51,753 కిలోమీటర్ల మేర పొడవైన ఓఎఫ్‌సీ నిర్మాణం పూర్తి అయినట్లు కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఆయన లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా ఈ విషయం చెప్పారు. రాష్ట్రంలో 2,759 గ్రామాలు 4జీ కనెక్షన్ల పరిధిలోకి వచ్చినట్లు ఆయన వెల్లడించారు.

## మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి చేతుల మీదుగా తొలివార్త దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ

**కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా బ్యూరో పాలకూరి నాగరాజు గౌడ**



**సూర్యాపేట 05 ఫిబ్రవరి (తొలి వార్త) :** సూర్యాపేటలోని ఎం.ఎల్.ఎ. క్యాంపు కార్యాలయంలో జగదీశ్వర్ రెడ్డి ని జిల్లా బ్యూరో పాలకూరి నాగరాజు గౌడ మర్యాద పూర్వకంగా కవడం జరిగింది. ఈ సందర్భంగా జగదీశ్వర్ రెడ్డి చేతుల మీదుగా తొలివార్త దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ నిజాన్ని ప్రజలకు తెలియజేయడం లో తొలి వార్త పత్రిక గుర్తింపు పొందుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా మాజీ జిల్లా పరిషత్ వి.ఎస్. చైర్మన్ గోపగాని వెంకట నారాయణ, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొనారు.

## చెట్టును ఢీకొట్టిన ద్విచక్ర వాహనం వాహనదారుడు పరిస్థితి విషమం 108 అంబులెన్స్ లో తరలింపు



**భద్రాద్రి జిల్లా ఫిబ్రవరి 5 (తొలి వార్త) :** అశ్వాపురం మండల పరిధిలోని నెల్లిపాక గ్రామ చివరలో సర్గం బాల నరసయ్య, వరి పొలాల చింత చెట్టు వద్ద గురువారం రాత్రి 8 గంటల సమయంలో ద్విచక్ర వాహనం రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొని ద్విచక్ర వాహనదారుడు వ్యక్తి ప్రమాదానికి గురయిండు. వ్యక్తి మణుగూరు చెందిన తోకల శంకర్ (45) వృత్తి కబోర్డ్ పని చేస్తాడని తెలిసింది. ఆయన పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రమాదం జరిగిందన్న విషయం తెలుసుకున్న,మొండికుంట గ్రామానికి చెందిన మెడికల్ షాప్ యజమాని సంపత్ సంఘటన స్థలానికి చేరుకొని 108 అంబులెన్స్ ద్వారా భద్రాచలం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ కి సంపత్ దగ్గరుండి తరలించినారు. ఈ సందర్భంగా నెల్లిపాక గ్రామస్తులు మరియు రోడ్డుపై వెళ్తున్న కొంతమంది వాహనదారులు మెడికల్ షాప్ సంపత్ ను అభినందించారు.

## అలియాబాద్ మున్సిపాలిటీలో ఇంటింటి ప్రచారం లో కాంగ్రెస్ నాయకులు



**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, ఫిబ్రవరి 5 తొలి వార్త ప్రతి నిధి :** మేడ్చల్ నియోజకవర్గ పరిధిలోని అలియాబాద్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన 1వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థి ధరవాత్తి రమేష్ నాయక్ ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగుతోంది. ఈ ప్రచార కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీల్లో వేగవంతమైన అభివృద్ధి జరగాలంటే అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలవాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే ఎనిమిదేళ్ల పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలో కొనసాగనుందని, అందువల్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే అభివృద్ధి పనులు త్వరత్వరగా జరుగుతాయని తెలిపారు. అలియాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.100 కోట్ల నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారని చెప్పారు. ఆ నిధులతో డ్రైనేజీ వ్యవస్థ, రహదారి అభివృద్ధి వంటి మౌలిక వసతులను మెరుగుపరుస్తామని పేర్కొన్నారు. అలాగే ఆసరా పెన్షన్లు 4000 రూపాయలు పెంచుతామణి, ఇళ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో అలియాబాద్ మున్సిపాలిటీ సర్వాంగీణ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు.

## సమ్మెను జయప్రదం చేయండి - ఏఐటీయూసీ



**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, ఫిబ్రవరి 5,వార్త ప్రతి నిధి :** ఈ నెల 12 న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి మున్సిపల్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు వి హరినాధరావు ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ డిసి ని కలిసి సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మున్సిపల్ రాష్ట్ర ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఏసురత్నం హాజరై మాట్లాడుతూ మోడీ సర్కార్ 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు మనదేశంలో ఉన్న అన్ని సంఘాలు కలిసి ఈనెల 12న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునివ్వడం జరిగింది. కార్మికుల సమ్మెతో బిజెపి సర్కారు కళ్ళు తెరవాలని లేనిపక్షంలో రాబోయే రోజుల్లో మోదీ సర్కారుపై కార్మికుల తిరుగుబాటు తప్పదని డిమాండ్ చేశారు కార్మికులు కర్షకులు యువతీ యువకులకు కన్నెర్ర చేస్తే బంగాళాఖాతంలో మీ సర్కారు కలవడం ఖాయమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మున్సిపల్ అధ్యక్షులు చల్లపల్లి రాములు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వంగాల శ్రీనివాసులు కార్మికులు పాల్గొనడం జరిగింది.

## నారాయణపేట ఆయకట్టు అభివృద్ధి శాఖ మరియు నీటి పారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కు వినతి



**నారాయణపేట ఫిబ్రవరి 05 (తొలివార్త) :** ఆయకట్టు అభివృద్ధి శాఖ మరియు నీటి పారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బ్రహ్మానందం ను కలిసిన అవుసలోనిపల్లి భారత రాష్ట్ర సమితి నాయకులు .గ్రామంలోని గుంతచెరువు యొక్క తూములు మరియు అలుగులు, చెరువు కట్ట వెడల్పు, కాలువల నిర్మాణం మరియు చెరువుకు ఇరువైపుల ముళ్ళ పొదలు తొలగించి, పూడిక తీత మరమ్మత్తులు తదితర సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్లగా వారు సానుకూలంగా స్పందించడం జరిగింది. చెరువు యొక్క ఆయకట్టు విస్తీర్ణం 284 ఎకరాలు సాగు అవుచున్నది. ఈ సంవత్సరం అధిక వర్షాల కారణంగా చెరువు కట్ట పూర్తిగా దెబ్బతిని పగుళ్ళు ఏర్పడి ఏక్షణానికైన తెగిపోవుటకు సిద్ధంగా ఉన్నది. తూములు మరియు అలుగులు మరమ్మత్తులు చేసి పూడిక తీసి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో సీనియర్ నాయకులు దాసరి తిమ్మయ్య, వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు

తొలివార్త

శుక్రవారం 06 - 02 - 2026

# రూ.1,60,000 దిగువకు బంగారం, రూ.30 వేలు తగ్గిన వెండి ధర

**ఒక్కరోజులోనే రూ.30వేలు తగ్గిన వెండి**

**భారీగా తగ్గిన వెండి, బంగారం ధరలు**

**24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,59,680**

**కిలో వెండి ధర రూ.2,69,000**



గత కొన్ని రోజులుగా పెరుగుతున్న బంగారం, వెండి ధరలు గురువారం తగ్గాయి. దేశీయ మార్కెట్‌లో ధరలు గురువారం కాస్త దిగొచ్చాయి. ముఖ్యంగా వెండి బుధవారంతో పోలిస్తే దాదాపు రూ.30 వేల మేర తగ్గింది. కిలో వెండి ధర రూ.2,69,000గా ఉంది. ఇక 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర రూ.6,600 తగ్గి రూ.1,59,680కు చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాములు ధర రూ.1,41,550గా ఉంది.

హైదరాబాద్‌లో పది గ్రాముల బంగారం ధర రూ.1,59,680గా ఉంది. కిలో వెండి ధర రూ.2,69,00గా ఉంది.

విజయవాడలో 10 గ్రాముల పసిడి ధర రూ.1,59,680గా ఉంది. కిలో వెండి ధర రూ. 2,69,00గా ఉంది.

విశాఖపట్నంలో పది గ్రాముల పుత్తడి ధర రూ.1,59,680గా ఉంది. కిలో వెండి ధర రూ.2,69,00గా ఉంది.

ప్రొద్దుటూరులో 10 గ్రాముల పసిడి ధర రూ.1,59,680గా ఉంది. కిలో వెండి ధర రూ.2,69,00గా ఉంది.

**అంతర్జాతీయ మార్కెట్‌లోనూ**

అంతర్జాతీయంగానూ ధరలు తగ్గుముఖం పట్టాయి. ఔన్సు బంగారం ధర 4919 డాలర్లుగా ఉంది. ఔన్సు వెండి ధర 79 డాలర్లుగా కొనసాగుతోంది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో డెలివరీ కాంట్రాక్టుకు వెండి దాదాపు 7 శాతం పడిపోయింది. కిలో ధర రూ.2.49 లక్షల వద్ద ఉంది. ఏప్రిల్ డెలివరీలకు పసిడి ధర స్వల్పంగా పెరిగి 10 గ్రాముల ధర రూ.1.53 లక్షలకు చేరింది.బుధవారం బంగారం, వెండి ధరలు పెరిగాయి. ఇటీవల యూఎస్ ఫెడ్‌కు కొత్త ఛైర్మన్ నియామకం, సీఎంఈ మార్జిన్‌ను పెంచడం, గరిష్ఠాల వద్ద భారీ ప్రాఫిట్ బుకింగ్ కారణంగా ఈ రెండు లోహాల ధరలు భారీగా పెరిగాయి. దీన్ని అవకాశంగా తీసుకుని మదుపర్లు దీర్ఘకాలిక వ్యూహంతో కొనుగోళ్లకు దిగడం వల్ల వీటికి మళ్లీ డిమాండ్ ఏర్పడింది. దీంతో అంతర్జాతీయ స్పాట్ మార్కెట్‌లో బంగారం ఔన్సు 4,887 డాలర్ల వద్ద కొనసాగుతుండగా, వెండి 85.98 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**ధరల్లో హెచ్చుతగ్గులు**

అయితే వెండి ధరల్లోని ఈ హెచ్చుతగ్గులపై 'ఆల్ ఇండియా జ్వెల్లర్స్ అండ్ గౌర్మెట్ ఫెడరేషన్' జాతీయ అధ్యక్షుడు పంకజ్ అరోరా ఇటీవల స్పందించారు. గత 15 రోజుల్లోనే వెండి ధర రూ.25 వేల నుంచి రూ.40 వేల వరకు పెరిగిందని అన్నారు. ఇంత వేగంగా, ఒకే దిశలో పెరగడం ఎప్పుడూ నిలకడగా ఉండదని తెలిపారు. అందుకే ఇప్పుడు ఈ హెచ్చుతగ్గులు అని చెప్పారు. అమెరికా వెండిని 'క్రిటికల్ మినరల్'గా గుర్తించడం, చైనా ఎగుమతులను నియంత్రించడంతో డిమాండ్ పెరిగిందని అన్నారు. అయితే ఎక్స్ఛేంజీలలో జరిగే 'పేపర్ ట్రేడ్' వల్ల ధరల్లో ఇంత అస్థిరత వస్తోందని అన్నారు.

**కొనుగోలుదార్లు జర జాగ్రత్త**

బంగారం, వెండి ధరలు రోజుల నుంచి నిమిషాల వ్యవధిలో మారిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఆభరణాల విక్రయదారులు ధరలను మార్చివేస్తున్నారు. ఆన్‌లైన్‌లో ధరలు ప్రకారమే నగదును వసూలు చేస్తున్నారు. కానీ ధరలు తగ్గినపుడు కొంతమంది వ్యాపారులు తగ్గింపును చూపడం లేదని కొనుగోలుదారులు అంటున్నారు. పెరిగిన ధరలనే చూపిస్తున్నారంటూ చెబుతున్నారు. నగలు కొనడానికి వెళ్లినప్పుడు ధరలను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవడం మంచింది.999 ప్యూరిటీ బంగారం ధర 92 శాతం వెచ్చిస్తే, వచ్చేదే 22 క్యారెట్ల బంగారం ధర. విక్రయదారులు చూపించే 24 క్యారెట్ల బంగారం ధరలో జీఎస్టీ కలిపి ఉంటుంది. అప్పుడు మళ్లీ ఆభరణాన్ని విక్రయించేటపుడు బంగారంపై జీఎస్టీను చూయించరాదు. ఆన్‌లైన్‌లో కంటే తక్కువ ధరకు బంగారం ఇస్తామని చెబితే అందులో జీఎస్టీ లేదని అర్థం. బిల్లు వేసేటప్పుడు అందులో 3 శాతం జీఎస్టీని కలుపుతారు.

# భారత్‌పై ప్రపంచం దృష్టి- స్థిరమైన నాయకత్వం, పటిష్టమైన వృద్ధే ఇందుకు కారణం

**ముకేశ్ అంబానీ**

**భారత ఆర్థిక వ్యవస్థ పండ్లు ఇచ్చే చెట్టు**

**ఇది సహజంగానే అందరి దృష్టిని ఆకర్షిస్తుంది**

**బ్లాక్‌రాక్ సీఈఓతో ముకేశ్ అంబానీ**




భారత్ తన బలమైన ఆర్థిక వృద్ధి, స్థిరమైన నాయకత్వం, నిలకడైన విధానాలతో ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోందని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముకేశ్ అంబానీ అన్నారు. భారత్ ఆర్థిక వ్యవస్థను పండ్లు ఇచ్చే చెట్టుగా అభివర్ణించిన ఆయన, ఇది సహజంగానే అందరినీ ఆకర్షిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్‌లో పర్యటిస్తున్న బ్లాక్‌రాక్ ఛైర్మన్ అండ్ సీఈఓ లారీ ఫింక్‌తో మాట్లాడుతూ, భారత్ ఆర్థిక వృద్ధి గురించి ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు."భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ. భారత్ 8-10 శాతం వృద్ధి రేటును సాధించడం, దాన్ని నిలబెట్టుకోవడం కూడా సాధ్యమే. భారతదేశంలో ఒక పాత సామెత ఉంది. పండ్లు కాసే చెట్టు మాత్రమే అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. నేడు భారత ఆర్థిక వ్యవస్థ అనే గొప్ప వృక్షం స్థిరత్వంతో, సమృద్ధిగా పండ్లను ఇస్తోంది. అందుకే చాలా కాలం తరువాత భారత్ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది."

**మోదీకి కృతజ్ఞతలు**

గత 10-15 ఏళ్లుగా భారత్‌లో స్థిరమైన నాయకత్వం ఉందని, అది కూడా భారత్‌పై ప్రపంచ దేశాల దృష్టి పెరగడానికి ప్రధాన కారణమని అంబానీ అభిప్రాయపడ్డారు. దేశ పురోగతిలో ఆర్థిక స్థిరత్వం నిర్ణయాత్మక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ సందర్భంగా పాలనలో నిలకడ, స్పష్టతను అందించిన ప్రధాని నరేంద్ర మోదీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే ప్రభుత్వ దీర్ఘకాలిక దార్శనికతను అంబానీ స్వాగతించారు. 'వికసిత్ భారత్' లక్ష్యం దేశ పౌరుల్లో విస్తృత ఆమోదాన్ని, నమ్మకాన్ని పొందిందని ఆయన అన్నారు. దేశంలో రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు, టెలికమ్యునికేషన్స్, ఇతర రంగాల్లలో జరిగిన అభివృద్ధిని ముకేశ్ అంబానీ ఉదహరించారు. భారీ ప్రాజెక్టులను చేపట్టగల సామర్థ్యం భారత్‌కు ఉందని, ఇదే వృద్ధికి కీలక కారకంగా ఉంటుందని అన్నారు. "స్థిరమైన నాయకత్వం ఒక దేశాన్ని నిర్వచిస్తుంది. మనకు స్థిరత్వాన్ని అందించిన మోదీకి మనం కృతజ్ఞతలు చెప్పాలి. మనకు 2047 నాటికి వికసిత్ భారత్ కావాలనే స్పష్టమైన లక్ష్యం ఉంది. దీనిని ప్రతి భారతీయుడు ఆకాంక్షిస్తున్నారు. విశ్వసిస్తున్నారు."

**ది ఎరా ఆఫ్ ఇండియా**

ఈ సందర్భంగా భారత్ గురించి బ్లాక్‌రాక్ సీఈఓ లారీ ఫింక్ కీలక వ్యాఖ్యలు చేశారు. "నేను భారత దేశాన్ని ఒక రోజు, ఒక వారం లేదా ఒక సంవత్సరం అనే దృక్పథంతో కాకుండా, సుదీర్ఘకాల పరిమితిలో చూస్తాను. రానున్న 20-25 ఏళ్లు 'ఇండియన్ ఎరా'గా ఉంటుంది. ఈ 'భారత యుగం' అంటే అంటే ఏమిటో, అందులో ప్రజలు ఎలా భాగస్వాములు కావచ్చో మరింత మందికి అర్థమయ్యేలా చూడడమే జియా బ్లాక్‌రాక్ ముఖ్య ఉద్దేశం." అని బ్లాక్‌రాక్ సీఈఓ లారీ ఫింక్ అన్నారు. అయితే పెట్టుబడిదారుడిగా తాను ఏ ఒక్క యుగాన్ని మాత్రమే చూడనని, జీవితకాలంలో పెట్టుబడిదారులకు ఉండే నిజమైన అవకాశాలపై మాత్రమే దృష్టి పెడతానని లారీ ఫింక్ స్పష్టం చేశారు. భారత ప్రజలు తమ పొదుపు, పదవీ విరమణ నిధులను పెట్టుబడిగా పెట్టడం ద్వారా దేశ వృద్ధి మరింతగా పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

**జియో బ్లాక్‌రాక్**

జియో బ్లాక్‌రాక్ బ్రోకింగ్ సంస్థ- భారతీయ పెట్టుబడిదారులకు తక్కువ ఖర్చుతో, పారదర్శకమైన, అధునాత సాంకేతికతతో కూడిన సేవలను అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. దీని మాతృ సంస్థ 'జియా బ్లాక్‌రాక్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్'. జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్, బ్లాక్‌రాక్ ఇంక్‌ల మధ్య ఇది 50:50 పర్సెంట్ జాయింట్ వెంచర్‌గా ఉంది.

# ఎప్ స్టీన్ తో స్నేహంపై బిల్ గేట్స్ ఏమన్నారంటే..!

**ఆరోపణలపై తొలిసారి స్పందించిన ప్రపంచ కుబేరుడు**

**ఆయనతో కలిసి గడిపినందుకు చింతిస్తున్నట్లు వెల్లడి**

**అందుకు క్షమాపణలు కోరుతున్నానని బిల్ గేట్స్ వ్యాఖ్య**



మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు, ప్రపంచ కుబేరుడు బిల్ గేట్స్ తనపై వచ్చిన ఆరోపణల విషయంలో తొలిసారి స్పందించారు. జెఫ్రీ ఎప్ స్టీన్ తో స్నేహంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. ఎప్ స్టీన్ తో కలిసి గడిపిన ప్రతీ నిమిషం పట్ల ఇప్పుడు చింతిస్తున్నానని, క్షమాపణలు కోరుతున్నానని వ్యాఖ్యానించారు. అతడితో తాను స్నేహం చేసి ఉండకూడదని అన్నారు. ఈ మేరకు బుధవారం ఆస్ట్రేలియా మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయంపై మాట్లాడారు. అయితే, ఎప్ స్టీన్ ఫైల్స్ లో బయటపడ్డ ఈమెయిల్ మాత్రం నిజం కాదని, ఏ ఉద్దేశంతో ఎప్ స్టీన్ ఆ మెయిల్ ను రాశాడో తెలియదని బిల్ గేట్స్ చెప్పారు.ఆ మెయిల్ కూడా ఎవరికీ పంపలేదనే విషయాన్ని గుర్తుచేశారు. 'రష్యన్ మహిళలతో లైంగిక సంబంధాల వల్ల బిల్ గేట్స్ కు సుఖవ్యాధులు సోకాయి. ఈ విషయం ఆయన భార్యకు తెలియకుండా ఉండేందుకు మందులు కావాలని కోరాడు. ఆయన కోరినట్లే మందులు ఇప్పించాను' అంటూ ఎప్ స్టీన్ ఓ ఈమెయిల్ లో పేర్కొన్నాడు. దానిని ఎవరికీ పంపకుండా డ్రాఫ్ట్ బాక్స్ లో సేవ్ చేసి పెట్టుకున్నాడు. తాజాగా ఈ ఈమెయిల్ బయటపడింది.అంతకుముందు బిల్ గేట్స్ మాజీ భార్య మిలిందా ఓ పోడ్ కాస్ట్ ఇంటర్వ్యూలో మాట్లాడారు. బిల్ గేట్స్ తో విడాకులకు ఎప్ స్టీన్ తో ఆయనకు ఉన్న స్నేహమే కారణమని చెప్పారు. ఎప్ స్టీన్ ఫైల్స్ లో తాజాగా మరోమారు బిల్ గేట్స్ పేరు బయటకు రావడం, బిల్ గేట్స్ కు రష్యన్ మహిళలతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలపై మిలిందా స్పందించారు. ఈ విషయంపై జవాబు చెప్పుకోవాల్సిన బాధ్యత బిల్ గేట్స్ కే ఉందని ఆమె వ్యాఖ్యానించారు. మిలిందా ఇంటర్వ్యూ ప్రసారమైన తర్వాత బిల్ గేట్స్ ఇంటర్వ్యూ వెలువడడం గమనార్హం.

# టెక్కీలకు శుభవార్త.. 25 వేల మంది ఫ్రెషర్ల నియామకానికి కాగ్నిజెంట్ ప్లాన్!

**గతేడాదితో పోలిస్తే నియామకాల్లో 20 శాతం వృద్ధి**

**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పెరిగిన ఉత్పాదకత**

**19 శాతం పెరిగిన నికర లాభం; జోరుగా కంపెనీ వృద్ధి**




ఐటీ రంగంలో ఉద్యోగాల కోతపై ఆందోళనలు నెలకొన్న తరుణంలో ప్రముఖ దిగ్గజం కాగ్నిజెంట్ నిరుద్యోగులకు తీపి కబురు అందించింది. 2026 ఏడాదిలో సుమారు 24,000 నుంచి 25,000 మంది ఫ్రెషర్లను నియమించుకోనున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఇది గత ఏడాదితో (20,000 నియామకాలు) పోలిస్తే 20 శాతం అధికం కావడం విశేషం. క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌ను మరింత వేగవంతం చేస్తూ, కంపెనీ తన టాలెంట్ పిరమిడ్‌ను మరింత విస్తృతం చేయాలని నిర్ణయించింది.సాధారణంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల ఉద్యోగాలు పోతాయనే వాదనలు వినిపిస్తుంటాయి. అయితే, కాగ్నిజెంట్ దీనిని మరో కోణంలో చూస్తోంది. జెమిని, ఓపెన్ ఏఐ వంటి ప్లాట్‌ఫారమ్‌లతో జతకట్టి ఏఐ టూల్స్ ద్వారా ఎంట్రీ లెవల్ ఉద్యోగుల ఉత్పాదకతను పెంచుతున్నామని సీఈఓ రవి కుమార్ వెల్లడించారు. ఏఐ సహాయంతో కొత్త ఇంజనీర్లు గతంలో కంటే వేగంగా క్లయింట్ ప్రాజెక్టుల్లో భాగస్వాములు అవుతున్నారని, అందుకే ఫ్రెషర్ల నియామకాన్ని పెంచుతున్నామని కంపెనీ స్పష్టం చేసింది.ఆర్థిక ఫలితాల పరంగానూ కాగ్నిజెంట్ అదరగొట్టింది. 2025 డిసెంబరుతో ముగిసిన నాలుగో త్రైమాసికంలో కంపెనీ నికర లాభం 18.7 శాతం వృద్ధి చెంది 64.8 కోట్ల డాలర్లకు చేరింది. సెప్టెంబర్ నాటితో పోలిస్తే డిసెంబర్ నాటికి ఉద్యోగుల సంఖ్య 1,800 పెరిగి మొత్తం 3.51 లక్షలకు చేరుకుంది. కేవలం మనుషుల శ్రమతోనే కాకుండా, డిజిటల్ లేబర్‌ను కూడా జోడించి 2026లో 2,266 కోట్ల డాలర్ల ఆదాయమే లక్ష్యంగా కాగ్నిజెంట్ ముందుకు సాగుతోంది. ఐటీ రంగం మందగమనంలో ఉందన్న వార్తల మధ్య కాగ్నిజెంట్ తీసుకున్న ఈ నిర్ణయం నిరుద్యోగ యువతలో కొత్త ఆశలు రేకెత్తిస్తోంది.

# తగ్గిన జోరు... ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు


**స్టాక్ మార్కెట్ల రెండు రోజుల లాభాలకు బ్రేక్**

**ఐటీ రంగ షేర్లలో భారీ అమ్మకాల ఒత్తిడి**

**కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావంపై పెరిగిన ఆందోళనలు**

**స్వల్ప లాభాలతో ఫ్లాట్‌గా ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ**

**భారీ నష్టాలను చవిచూసిన ఇన్ఫోసిస్, టీసీఎస్**




దేశీయ స్టాక్ మార్కెట్లలో రెండు రోజుల లాభాలకు బుధవారం బ్రేక్ పడింది. ఐటీ రంగ షేర్లలో భారీ అమ్మకాల ఒత్తిడి నెలకొనడంతో సూచీలు దాదాపు ఫ్లాట్‌గా ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 78.56 పాయింట్ల స్వల్ప లాభంతో 83,817.69 వద్ద, నిఫ్టీ 48.45 పాయింట్లు పెరిగి 25,776.00 వద్ద స్థిరపడ్డాయి.కృత్రిమ మేధ (ఏఐ) టెక్నాలజీలో వేగంగా వస్తున్న పురోగతిపై నెలకొన్న కొత్త ఆందోళనలు పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఏఐ స్టార్టప్ ఆంత్రోపిక్ న్యాయవాదుల కోసం ఒక కొత్త టూల్‌ను ప్రారంభించడమే ఇందుకు కారణం. ఇలాంటి ఏఐ టూల్స్ వేగంగా అభివృద్ధి చెందడం వల్ల సంప్రదాయ సాఫ్ట్‌వేర్ సేవలకు డిమాండ్ తగ్గి, ఐటీ పరిశ్రమ లాభదాయకత దెబ్బతినవచ్చని ఇన్వెస్టర్లు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రభావంతోనే నిఫ్టీ ఐటీ ఇండెక్స్ ఏకంగా 6 శాతం కుప్పకూలింది.సెన్సెక్స్ స్టాక్స్‌లో ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్‌టెక్, టెక్ మహీంద్రా షేర్లు ప్రధాన నష్టాల్లో ముగిశాయి. యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు కూడా నష్టపోయాయి. మరోవైపు, ఎటర్నల్, ట్రెంట్, ఎన్టీపీసీ, పవర్ గ్రిడ్, అదానీ పోర్ట్స్ షేర్లు లాభపడ్డాయి. రంగాల వారీగా చూస్తే, ఐటీతో పాటు ఫార్మా ఇండెక్స్ కూడా 0.34 శాతం నష్టపోయింది. అయితే, నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్ ఇండెక్స్ 2.6 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ ఇండెక్స్ 2 శాతం పెరిగి మార్కెట్లకు మద్దతునిచ్చాయి.ప్రధాన సూచీలు ఫ్లాట్‌గా ఉన్నప్పటికీ, బ్రాడర్ మార్కెట్‌లో సానుకూల వాతావరణం కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.63 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.27 శాతం లాభపడ్డాయి. నిపుణుల ప్రకారం, నిఫ్టీ రోజంతా 25,680 – 25,820 మధ్య పరిమిత శ్రేణిలో కదలాడింది. 25,800 స్థాయిని దాటితేనే సూచీలో మరింత సానుకూలత రావచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఆర్‌బీఐ మానిటరీ పాలసీ.. వడ్డీ రేట్లు యథాతథం?



ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితి, మారుతున్న ద్రవ్యోల్బణ గణాంకాలు, దేశీయ బాండ్ మార్కెట్ ఒత్తిళ్ల మధ్య ఆర్‌బీఐ తన ఫిబ్రవరి పాలసీలో వడ్డీ రేట్లను మార్చకపోవచ్చని తెలుస్తోంది. గతేడాది నుంచి దేశీయంగా వడ్డీ రేట్లు తగ్గుతున్నప్పటికీ ప్రస్తుత పరిస్థితులు మరింత అప్రమత్తంగా వ్యవహరించే అవకాశం ఉన్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు. ఫిబ్రవరి 4 నుంచి 6 వరకు జరిగే ఆర్‌బీఐ మానిటరీ సమావేశంలోని అంశాలు రేపు ఉదయం వెలువడనున్నాయి.

**అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలు**

గత పాలసీ సమావేశం తర్వాత జరిగిన అతిపెద్ద పరిణామం భారత్-అమెరికా, భారత్-యూరప్ మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాలు. దీని ఫలితంగా భారతీయ వస్తువులపై సుంకాలు గతంలో ఉన్న 50% నుంచి 18%కి గణనీయంగా తగ్గాయి. ప్రస్తుతం ఆసియా దేశాల్లోనే అతి తక్కువ టారిఫ్ రేట్లు కలిగిన దేశాల్లో ఒకటిగా భారత్ నిలిచింది. ఇది మన ఎగుమతిదారుల పోటీతత్వాన్ని భారీగా పెంచనుంది.

**ప్రపంచ ఆర్థిక అనిశ్చితి**

అంతర్జాతీయంగా ఆర్థిక పరిస్థితులు ఇంకా సందిగ్ధంలోనే ఉన్నాయి. 'జియో-ఎకనామిక్స్ స్ట్రెస్ ఇండెక్స్' ప్రకారం అంతర్జాతీయ అనిశ్చితి పెరిగిన 3-4 నెలల తర్వాత ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం కనిపిస్తుంది. మరోవైపు గత వారం భారీ పతనాన్ని చూసిన లోహాల ధరలు తిరిగి కోలుకోవడం గమనార్హం.

**అమెరికా ఫెడ్ రేట్ల కోత సంకేతాలు**

అమెరికాలో లేబర్ మార్కెట్ మందగించడం, వాస్తవ ఆదాయం స్థిరంగా ఉండటం, ద్రవ్యోల్బణ ప్రభావం తగ్గడంతో.. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించే దిశగా అడుగులు వేస్తోంది. ఇది ప్రపంచ మార్కెట్లపై సానుకూల ప్రభావం చూపే అవకాశం ఉంది.


**రూపాయి ఒడిదుడుకులు**

గత రెండు నెలలుగా రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే రూ.89-92 మధ్య ఊగిసలాడుతోంది. ఏప్రిల్ 2025లో అమెరికా సుంకాలను పెంచినప్పటి నుంచి రూపాయి 5.8% మేర క్షీణించింది. అయితే ఇటీవలి భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం తర్వాత రూపాయి విలువ కోలుకోవడం సానుకూలాంశం.

**ద్రవ్యోల్బణం**

ద్రవ్యోల్బణ గణనలో భాగంగా కొత్త సీపీఐ వెయిటేజీలను ప్రవేశపెట్టారు. దీని ప్రకారం సాధారణ సమయంలో ద్రవ్యోల్బణం 20-30 బేసిస్ పాయింట్లు పెరిగే అవకాశం ఉండగా.. ఆహార ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉన్న నెలల్లో మాత్రం కొత్త లెక్కల ప్రకారం సీపీఐ 20-30 బేసిస్ పాయింట్లు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉంది.పైన పేర్కొన్న మిశ్రమ పరిస్థితుల నేపథ్యంలో ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలోని కమిటీ ప్రస్తుతానికి కీలక వడ్డీరేట్ల మార్పులపై వేచి చూసే ధోరణిని అవలంబిస్తుదని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# ఐటీ పెట్టుబడిదారుల్లో ఆందోళన




కృత్రిమ మేధ (ఏఐ) విభాగంలో ఆంత్రోపిక్ సంస్థ తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పు భారత ఐటీ రంగాన్ని వణిక ిస్తోంది. ఆంత్రోపిక్ తన 'క్లాడ్ కోవర్క్' ఏజెంట్ కోసం సరికొత్త ఆటోమేషన్ ప్లగ్ఇన్‌లను విడుదల చేసింది. దాంతో శ్రమ ఆధారిత సర్వీసుల పై ఆధారపడిన భారత ఐటీ కంపెనీల భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ పరిణామం ఫలితంగా స్టాక్ మార్కెట్‌లో ఇటీవల ఐటీ షేర్లు భారీగా కుప్పకూలాయి.

**ఐటీ రంగానికి సవాలు..**

ఆంత్రోపిక్ విడుదల చేసిన కొత్త ప్లగ్ఇన్‌లు కేవలం సాధారణ చాటింగ్ కోసం మాత్రమే కాదు, ఒక సంస్థలోని కీలక విభాగాలను స్వయంచాలకంగా నిర్వహించేలా రూపొందించారు. వీటి ప్రభావం ప్రధానంగా కింది విభాగాలపై ఉండనుంది.లీగల్, ఫైనాన్స్: కాంట్రాక్ట్ రివ్యూ, కంప్లయన్స్ వంటి సంక్లిష్ట ప్రక్రియలను ఏఐ వేగంగా పూర్తి చేస్తుంది.కస్టమర్ సపోర్ట్: టికెట్ల వర్గీకరణ, సమాధానాలు ఇవ్వడం.. వంటి అంశాలపై మనుషుల ప్రమేయం లేకుండానే సమస్యల పరిష్కారాన్ని క్లాడ్ నిర్వహిస్తుంది.సేల్స్, మార్కెటింగ్ వ్యూహాలను రూపొందించి వాటిని సమర్థంగా అమలు చేస్తుంది.ఎంటర్‌ప్రైజ్ సెర్చ్: ఒక కంపెనీలోని ఈ-మెయిల్‌లు, క్లౌడ్ స్టోరేజ్, చాట్ డేటాను విశ్లేషించి నివేదికలు తయారు చేస్తుంది.ఇప్పటివరకు 'సాస్' ఆధారిత సర్వీసుల ద్వారా పై పనులను నిర్వహించేవారు. ఏదైనా సాఫ్ట్‌వేర్‌ను మన కంప్యూటర్ లేదా ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోకుండా, నేరుగా ఇంటర్నెట్ ద్వారా వాడుకోవడాన్ని సాస్ అంటారు. ఇప్పుడు చర్చల్లో ఉన్న క్లాడ్ కోవర్క్ వంటి ఏఐ సాధనాలు వస్తే భవిష్యత్తులో సాప్ వంటి ప్రత్యేక సాఫ్ట్‌వేర్ల అవసరం లేకుండా ఏఐతోనే పనులు చేయిస్తారని ఇన్వెస్టర్లు భయపడుతున్నారు.




# 'బుల్లెట్ సునీల్'గా రాజశేఖర్ రీ ఎంట్రీ 'బైకర్' గ్లింప్స్‌తో ఫ్యాన్స్‌లో జోష్

ఒకప్పుడు టాలీవుడ్‌లో యాక్షన్ హీరోగా, యాంగ్రీ స్టార్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రాజశేఖర్ కొంతకాలం విరామం తర్వాత మళ్లీ ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. ఈసారి హీరోగా కాకుండా పవర్‌ఫుల్ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించడంతో సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. శర్వానంద్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'బైకర్' సినిమాలో రాజశేఖర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. బైక్ రేసింగ్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రం ఏప్రిల్ 3న విడుదలకు సిద్ధమవుతోంది.ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై మంచి అంచనాలు తీసుకురాగా, తాజాగా మేకర్స్ రాజశేఖర్ పాత్రకు సంబంధించిన 'బుల్లెట్ సునీల్' గ్లింప్స్ విడుదల చేశారు. ఈ గ్లింప్స్‌లో రాజశేఖర్‌ను ఓ మాజీ పవర్‌ఫుల్ బైక్ రేసర్‌గా చూపిస్తూ స్టైలిష్ లుక్, గంభీరమైన ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. కొన్నేళ్ల తర్వాత ఆయనను ఇంత ఎనర్జిటిక్‌గా, మాస్ షేడ్ ఉన్న పాత్రలో చూడబోతున్నామనే సంకేతాలు ఈ వీడియో ఇచ్చింది.గ్లింప్స్ విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. రాజశేఖర్ స్క్రీన్ ప్రెజెన్స్, బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ మళ్లీ పాత రోజుల్ని గుర్తు చేస్తున్నాయని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. "ఇది రాజశేఖర్‌కు గ్యారెంటీ కంబ్యాక్ మూవీ అవుతుంది" అంటూ ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో ఆయన కనిపించడమే సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. శర్వానంద్‌తో పాటు రాజశేఖర్ లాంటి సీనియర్ నటుడు కీలక పాత్రలో కనిపించడం సినిమాకు అదనపు బలం అవుతుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. యూత్‌కు దగ్గరైన బైక్ రేసింగ్ కథతో పాటు అనుభవజ్ఞులైన నటుల ప్రెజెన్స్ ఉండటంతో 'బైకర్' మూవీపై అంచనాలు క్రమంగా పెరుగుతున్నాయి. సెకండ్ ఇన్నింగ్స్‌లో రాజశేఖర్ ఎలాంటి పాత్రలు ఎంచుకుంటారన్న ఆసక్తి ప్రేక్షకుల్లో ఎప్పటినుంచో ఉంది. 'బుల్లెట్ సునీల్' గ్లింప్స్‌తో ఆయన మళ్లీ పవర్‌ఫుల్ పాత్రలతో అలరించబోతున్నారని సంకేతాలు రావడంతో, ఈ సినిమా ఆయన కెరీర్‌లో మరో మలుపు తిప్పే అవకాశం ఉందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# రియల్ స్టోరీ మారెమ్మ.. టీజర్ రిలీజ్



మాస్ మహారాజా రవితేజ సోదరుడి తనయుడు మాధవ్ భూపతిరాజు హీరోగా వస్తోన్న తాజా చిత్రం మారెమ్మ. ఈ సినిమాకు మంచాల నాగరాజు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ యధార్థ సంఘటనల ఆధారంగా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి టీజర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ సినిమాలో దీపా బాలు హీరోయిన్‌గా కనిపించనున్నారు. తాజాగా విడుదలైన టీజర్ చూస్తుంటే గ్రామీణ నేపథ్యంలో సాగే రియల్ స్టోరీగా తెరకెక్కించినట్లు తెలుస్తోంది. ఊరికి శాపం చుట్టుకోవడంతో గ్రామ దేవత మారెమ్మకు పూజలు చేయడం టీజర్‌లో చూపించారు. ఈ చిత్రాన్ని మోక్ష ఆర్ట్స్ పతాకంపై మయూర్ రెడ్డి బండారు నిర్మించారు. ఈ సినిమాలో వినోద్ కుమార్, వీఎస్ రూపా లక్ష్మి, దయానంద్ రెడ్డి కీలక పాత్రల్లో నటించారు. ఈ మూవీకి ప్రశాంత్ ఆర్.విహారి సంగీతమందిస్తున్నారు.

# మెగా 158 అప్‌డేట్: చిరంజీవి సినిమాలో 'ధురంధర్' హీరోయిన్


మన శంకర వర ప్రసాద్ సినిమాతో మెగాస్టార్ చిరంజీవి బ్లాక్ బస్టర్ అందుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమా అనంతరం సమ్మర్‌లో అతడి విశ్వంభర చిత్రం కూడా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ సినిమా తర్వాత బాబీతో మెగా 158 సినిమా చేయబోతున్నాడు చిరు. ఈ ప్రాజెక్ట్ గురించి ఒక ఆసక్తికరమైన వార్త ఫిలిం నగర్ వర్గాల్లో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో చిరంజీవి కుమార్తెగా ఒక కీలక పాత్ర కోసం 'పొన్నియిన్ సెల్వన్' ఫేమ్, ధురంధర్ సినిమా సారా అర్జున్ పేరును దాదాపు ఖరారు చేసినట్లు సమాచారం. ఈ పాత్ర సినిమాలో అత్యంత కీలకం కానుందని తెలుస్తుంది. అయితే దీనిగురించి త్వరలోనే అధికారిక ప్రకటన రాబోతుంది. మరోవైపు చిరంజీవి కెరీర్‌లో ఇదొక ప్రత్యేకమైన మూవీగా నిలిచిపోతుందని మెగా అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతుండగా కన్నడ నిర్మాణ సంస్థ కేవిఎన్ ప్రోడక్షన్ బ్యానర్ ఈ సినిమాను నిర్మిస్తుంది.



# 'అమరన్' దర్శకుడితో ధనుష్.. కీలక పాత్రలో మమ్ముట్టి

తమిళ స్టార్ హీరో ధనుష్ తన 55వ సినిమాను (డి55) 'అమరన్' దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో చేస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ క్రేజీ ప్రాజెక్ట్ నుంచి ఒక అదిరిపోయే అప్‌డేట్ వెలుబడింది. ఈ చిత్రంలో మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి ఒక కీలక పాత్ర పోషిస్తున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ధనుష్ మరియు మమ్ముట్టి పూర్తిస్థాయిలో కలిసి నటిస్తున్న మొదటి సినిమా కావడంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. మరోవైపు దాదాపు ఏడేళ్ల (2019లో వచ్చిన 'పేరంబు') తర్వాత మమ్ముట్టి తమిళ సినిమాలో నటిస్తుండటం విశేషం. ఈ సినిమాలో ధనుష్ సరసన సాయి పల్లవి మరియు శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తున్నారు. 'అమరన్' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న రాజ్‌కుమార్ పెరియసామి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తుండగా.. యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. ధనుష్ స్వయంగా తన వండర్‌బార్ ఫిలింస్ బ్యానర్‌పై ఆర్‌టేక్ స్టూడియోస్‌తో కలిసి ఈ భారీ యాక్షన్ డ్రామాను నిర్మిస్తున్నాడు.






# మెగా ఫ్యాన్స్‌కు షాక్.. పెద్ది మూవీ రిలీజ్ వాయిదా

రామ్ చరణ్ హీరోగా వస్తోన్న రూరల్ స్పోర్ట్స్ డ్రామా పెద్ది. ఈ సినిమా కోసం మెగా ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు మేకర్స్. ఈ ఏడాది మార్చి 27న రిలీజ్ చేస్తామని మేకర్స్ ప్రకటించారు. కానీ తాజాగా అభిమానులకు బిగ్ షాకిచ్చింది మూవీ టీమ్. పెద్ది విడుదలను వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది. పెద్ది మూవీ కొత్త రిలీజ్ డేట్‌ను మేకర్స్ అనౌన్స్ చేశారు. దాదాపు నెల రోజుల పాటు ఈ సినిమాను వాయిదా వేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నట్లు పోస్టర్‌ను పంచుకున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. దీంతో మార్చిలో పెద్ది చూడాలనుకున్న మెగా ఫ్యాన్స్ తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఈ సినిమాకు బుచ్చిబాబు సనా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు.

**దురంధర్-2 వల్లేనా?**

అయితే పెద్ది మూవీ వాయిదా వేయడంపై నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. రణ్‌వీర్ సింగ్ స్పై యాక్షన్ థ్రిల్లర్ సీక్వెల్ దురంధర్-2 మార్చి 19న థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ సారి దక్షిణాది భాషల్లోనూ ఈ సినిమాను విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పెద్దిని వాయిదా వేసి ఉంటారని నెటిజన్స్ భావిస్తున్నారు. ఇప్పటికే అడివి శేష్ నటించిన డకాయిట్ సైతం వాయిదా పడిన సంగతి తెలిసిందే.

PUBLISHED AND OWNER BY LINGALA NARENDER Published at 10-1-1-/A, THIRMURTHY COLONY,PRIYADARSHINI PARK BESIDE,SAROOR NAGAR,RANGAREDDY District TELANGANA - 500035. Printed at SMILYSONLINE 6-7-48,VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY District,TELANGANA - 500070. EDITOR LINGALA NARENDER RNI NO. : TGTEL/25/A0357 ,CELL : 9010880040